జనరాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 3 సంచిక - 7 పక్షపత్రిక ఏప్రిల్ 1-15, 2012




# సిబిఐ ఛార్జిషీట్



మహబూబ్‌నగర్ జిల్లా పిల్లలమర్రిలో 700 సంవత్సరాల మర్రిచెట్టు



పులికాట్ సరస్సులో అద్భుత దృశ్యం

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక ఏప్రిల్ 1-15, 2012

సంపుటి - 3 సంచిక - 7

## లోపలి పేజీల్లో...

జగన్‌పై సిబిఐ ఛార్జిషీట్..................... 5

భూపందేరాలపై కాగ్ నివేదిక.............. 7

ఉప ఎన్నికల కలకలంలో ప్రధాన పార్టీ.. 10

మయన్మార్ ఉప ఎన్నికల్లో సూకీ విజయం....... 14

అమాయకత్వం నుండి ప్రజలు బయటపడతారు... 15

విద్యుత్ ఛార్జీల వడ్డన........................ 22

భారత్‌లో పేదరికాన్ని పెంచుతున్న
వైద్యసేవల భారం.............................. 24

రాష్ట్రంలో కుటుంబాలు, వసతులు........ 25

పెరుగుతున్న ఏకబిడ్డ దంపతులు.......... 27

అమెరికాలో వ్యవసాయరంగం............. 28

పోలవరాన్ని రాజకీయం చేయకండి.... 30

ఇది రైతుల ఆత్మగౌరవ పోరాటం......... 31

రైతు సత్యాగ్రహ యాత్రలో మహిళాసత్తా.. 32

లోక్‌సత్తా పార్టీ కార్యక్రమాలు............. 33

## సంపాదకవర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

**డి.వి.వి.యస్. వర్మ**
సంపాదకులు

**సంపాదక వర్గం**

జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
డి.టి.పి : జ్యోతి తాటి
ఫొటోలు : ఎన్. సంజీవ్ కుమార్

# రాజ్యసభ ఎన్నికల్లో డబ్బుసంచులు

## సంపాదకీయం

ఎన్నికల్లో డబ్బుసంచులు... ఎక్కడ చూసినా డబ్బు సంచులు... పంచాయితీ ఎన్నికల నుండి పార్లమెంటు ఎన్నికల వరకు ఎక్కడ చూసినా డబ్బుసంచుల సంచారం సాగి పోతున్నది. మన ప్రజాస్వామ్యం రాను రాను సామాన్యుల చేతులలో నుండి అక్రమార్కుల చెరలోకి పోతున్నది.

ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన శాసనసభ ఉప ఎన్నికలలో ధన ప్రవాహం జోరుగా సాగింది. దాదాపు 9 1/2 కోట్ల రూపాయల అక్రమ రవాణాను పోలీసులు పట్టుకున్నారు. ఇక్కడ ప్రజల్ని వందలతో, వేలతో ప్రలోభపెట్టారు. సొమ్ముతో దొరికినవాళ్లు, డబ్బుపంచుతూ దొరికిన వాళ్లున్నారు. వారు ఏ పార్టీకి సంబంధించిన వారో, సొమ్ములు ఎక్కడి నుండి వచ్చాయో కూడా తెలుసు. పత్రికలు ఏ పార్టీ ఎంతెంత ఇచ్చిందీ లెక్కలు కూడా ప్రకటించాయి. దీనిమీద లోక్‌సత్తాతో సహా అనేక మంది ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదులు చేశారు. కాని ఎన్నికల కమిషన్ నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించింది. సొమ్ములు పంచిన పార్టీల మీద, అభ్యర్థుల మీద ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

ఇప్పుడు జార్ఖండ్‌లో రాజ్యసభకు జరిగిన ఎన్నికలలో డబ్బుసంచుల సంచారం మీద స్పందించింది. ఆ ఎన్నికను రద్దుచేసే తీవ్ర చర్చకు సాహిసించింది. ఇది హర్షణీయం. ఆహ్వానించదగ్గ పరిణామం. మార్చి 30వ తేదీన దేశవ్యాప్తంగా రాజ్యసభలో ఏర్పడిన ఖాళీలకు ఎన్నికలు జరిగాయి. జార్ఖండ్‌లో రెండు స్థానాలున్నాయి. దానికి పోటీ పడ్డ వారిలో బి.జె.పి. తోడ్పాటునిచ్చిన స్వతంత్ర అభ్యర్థి అగర్వాల్ వున్నారు. ఈ ఎన్నికలలో శాసనసభ్యుల "గుర్రాల బేరం" జోరుగా సాగుతున్నదని ముందు నుండీ వార్తలు వచ్చాయి. ఎన్నికల రోజు ఉదయం 2 కోట్ల 15 లక్షలతో ఒక కారు పట్టుబడింది. ఈ సొమ్ము అగర్వాల్ అల్లుడు పంపినట్టు తేలింది. ఈ కారు అభ్యర్థి సోదరునిదిగా గుర్తించారు. డబ్బుసంచులతో బయలుదేరిన మరో రెండు కార్లు ఈ సోదా సమాచారం తెలిసి వెనుదిరిగి పోయినట్లు గుర్తించారు. దీనిపై సోదా జరుగుతున్నది.

మరోపక్క ఎన్నికల ప్రక్రియ పూర్తి అయింది. 81 శాసన సభ్యులలో ఒకస్థానం, ఖాళీకాగా 79 మంది ఓట్లు వేశారు. రాజ్యసభ ఓటింగు పద్ధతి బహిరంగ బ్యాలెట్ పద్ధతి. అంటే శాసనసభ్యులు తమ ఓటుపై ఎవరికి ఓటు వేసిందీ గుర్తించిన తర్వాత అక్కడ తమ పార్టీ ఎన్నికల ఏజంటుకు చూపించిన తర్వాతే డబ్బాలో వేస్తారు. కాని ముగ్గురు సభ్యులు తమ పార్టీ అధికార ఏజంట్లకు చూపకపోగా ప్రత్యర్థుల ఏజంట్లకు చూపించి ఓటు వేశారు. అలా చూపించకుండా వేసిన ఓటును తిరస్కరించడానికి వీలుంది. జార్ఖండ్ ముక్తిమోర్చాకు చెందిన విష్ణుభయ్యా, కాంగ్రెస్‌కి చెందిన కె.యస్.త్రిపాఠీ, రాష్ట్రీయ జనతాదళ్‌కు చెందిన సురేష్ పాశ్వాన్‌లు ఇలా ఓటు చేశారు. దీంతో ఎన్నికల కమిషన్ ఈ ఎన్నికల్లో బేరసారాలు సాగాయన్న నిర్ధారణకు వచ్చి ఈ ఎన్నికలను రద్దు చేసింది.

డబ్బు సంచుల మీద వేటుకు రాజ్యసభ ఎన్నికలు పద్ధతి వీలు కల్పించింది. మొత్తం మీద మన ఎన్నికల వ్యవస్థను డబ్బుసంచుల నుండి విముక్తి చెయ్యాలి. అందుకు తగిన విధంగా ఎన్నికల వ్యవస్థను పూర్తిగా సంస్కరించాలి. లేకపోతే ఒకచోట ఆపితే మరో రూపంలో ఇది ప్రత్యక్షమౌతూనే వుంటుంది. ✶




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
8-2-674బి/2/9, ప్లాట్ నం : 93
హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ,
బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034

**ఫోన్ నంబర్లు :**
**040-23311817, 23311819, 23311820, 23312829**
**ఫ్యాక్స్ : 040-23310612**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**
సెల్ : *80085 07934*

విడి ప్రతి : రు. *10* ,
ఏడాది చందా : రు. *200*
మూడేళ్ళ చందా : రు. *500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# జగన్‌పై సిబిఐ ఛార్జిషీటు



*జగన్ అక్రమ ఆస్తుల కేసులో సిబిఐ మార్చి 31 తేదీన తొలి ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది. తొలి ముద్దాయిగా జగన్ పేరును పేర్కొన్నారు. ఐపిసి120బి (రెడ్‌విత్ 420) 409, 420 477ఎ. మరియు అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 13(2) రెడ్‌విత్ 13(1) (సి) (డి) సెక్షన్‌ల కింద జగన్‌పై అభియోగాలను నమోదు చేశారు. నాటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి - ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉరుకులు పరుగులు పెట్టించి.. ప్రభుత్వ భూములను అరబిందో, హెటిరో వంటి కంపెనీలకు ఎంత అడ్డగోలుగా, ఆగమేఘాల మీద కట్టబెట్టింది, తిరిగి ఆ కంపెనీలు జగన్ కంపెనీల్లో ఎలా 'పెట్టుబడులు' చెల్లించుకుందీ ఛార్జిషీట్‌లో సీబీఐ ఆధారాలతో సహా పేర్కొంది.*

## ప్రధాన అభియోగాలు

**ప్రభుత్వం నుంచి అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. కుమారుడు జగన్ పరోక్షంగా పొందిన అనుచిత లబ్ధికి సీబీఐ మచ్చుకు చూపిన కొన్ని ఆధారాలివి....**

- అరబిందో, హెటిరో కంపెనీలకు జడ్చర్ల సెజ్‌లో 150 ఎకరాల కేటాయింపుల వ్యవహారా ఆద్యంతం ఆగమేఘాల మీద, అనుమానాస్పదంగా, అక్రమాల బాటలోనే జరిగింది.
- అరబిందో, హెటిరో కంపెనీలు 2006 నవంబరు17న – తమకు సెజ్‌లో చెరొక 75 ఎకరాలు కావాలని ఐపీఐసీకి దరఖాస్తు చేసుకున్నాయి. అదీ, ఎకరం రూ.7 లక్షలకే ఇవ్వాలని ధర కూడా అవే చెప్పాయి. ప్రభుత్వ నిర్ణయానికంటే ముందే, దరఖాస్తుతోపాటే 10% ధరావత్తు సొమ్ముగా ఏకంగా రూ.52.5 లక్షల చెక్ కూడా పంపించేశాయి.
- నిజానికి అప్పటికే ఆ సెజ్‌లో ఎకరా ధర కూ.15 లక్షలని ' ధరల నిర్ణాయక కమిటీ' నిర్ధారించింది. బీపీఆచార్య ఆ సిఫార్సులను కాలదన్ని మరీ అరబిందో, హెటిరో కంపెనీలు కోరుకున్నట్లుగా రూ.7 లక్షలకే ఇస్తూ... మొత్తం అధికారిక కేటాయింపు ప్రక్రియనంతా అదే రోజు దగ్గరుండి నడిపించి, సంతకం పెట్టేసి.. తానే స్వయంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ వద్దకు తీసుకువెళ్లి, ఆయన చేతులతో ఆ ఒప్పందం ఖరారు పత్రాలను అరబిందో, హెటిరో ప్రతినిధులకు ఇప్పించారు.
- వాటికంటే ముందు 2006 నవంబరు 13/14 తేదీలలో లీఫార్మ లిమిటెడ్ పెట్టుకున్న దరఖాస్తులను మాత్రం పక్కన పట్టేశారు.
- పటాన్‌చెరు దగ్గర పాశమైలారంలో అరబిందోకు కేటాయించిన 30.33 ఎకరాలను 'ట్రైడెంట్ లైఫ్ సైన్సెస్' సంస్థలకు బదిలీ చేయటంలో పద్దతులేవీ పాటించలేదు.
- వాస్తవానికి 'ట్రైడెంట్' పూర్తిగా అరబిందో అనుబంధం కంపెనీ కాకపోయినా... వారు అనుబంధమేనంటూ తప్పుడు ధృవపత్రం సమర్పించారు. దీన్ని ఐపీఐసీ బాధ్యులైన బీపీ ఆచార్యగానీ, వై.వి.ఎల్.ప్రసాద్‌గానీ మరెవ్వరూగానీ సరిచూడలేదు. అభ్యంతరం వ్యక్తం చేయలేదు. ప్రభుత్వం రూ.4.3 కోట్లు నష్టపోయింది.

## అభియోగపత్రంలో నిందితులు వీరే

**1. వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి**

**2. విజయసాయి రెడ్డి**
(ఛార్టెడ్ అకౌంటెంట్, ప్రస్తుత జ్యూడిషియల్ కస్టడీలో ఉన్నారు

**3. అరబిందో గ్రూప్ కంపెనీలు**
(అరబిందో ఫార్మా లిమిటెడ్, ఏపీఎల్ హెల్త్ కేర్ లిమిటెడ్ - ప్రతినిధి ఎండీ కె. నిత్యానందరెడ్డి)

**4. హెటిరో గ్రూప్ కంపెనీలు**
(హెటిరో డ్రగ్స్ లిమిటెడ్, హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్ - ప్రతినిధి డెరక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి)

**5. ట్రైడెంట్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్**
(ప్రతినిధి... ఎం.డీ. పి. శరత్ చంద్రారెడ్డి)

**6. ఎం. శ్రీనివాసరెడ్డి**
డైరెక్టర్, హెటిరో డ్రగ్స్ లిమిటెడ్, ఇతర గ్రూప్ కంపెనీలు

**7. కె. నిత్యానందరెడ్డి**
ఎండీ, అరబిందో ఫార్మలిమిటెడ్, ఇతర గ్రూప్ కంపెనీలు

**8. పి. శరత్‌చంద్రారెడ్డి**
ఎండీ, ట్రైడెంట్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్

**9. బి.పి. ఆచార్య**
ఏపీఐఐసీ అప్పటి ఛైర్మన్/వైస్‌ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్

**10. యద్దనపూడి విజయలక్ష్మీ ప్రసాద్**
ఏపీఐఐసీ విశ్రాంత జనరల్ మేనేజర్ (ప్రాజెక్టు)

**11. పి.ఎస్. చంద్రమౌళి**
అరబిందో ఫార్మ లిమిటెడ్ అప్పటి కంపెనీ సెక్రటరీ

**12. జగతి పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్**
(ప్రతినిధి అప్పటి డైరెక్టర్ అండ్ ఛైర్మన్ వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి)

**13. జనని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్**
(బెంగుళూరు)

### అభియోగపత్రం దాఖలు చేయని నిందితులు

- **కె. ప్రసాద్ రెడ్డి** (ఎఫ్ఐఆర్‌లో 67వ నిందితుడు)
- **కె. రాజేశ్వరీ** (ఎఫ్ఐఆర్‌లో 68వ నిందితుడు)

## జగన్ కంపెనీల్లోకి....

- అరబిందో, హెటిరో, ట్రైడెంట్ కంపెనీలు వైఎస్ కుమారుడైన వై.ఎస్. జగన్మోహన రెడ్డి కంపెనీలైన జగతి మీడియా, జనని ఇన్‌ఫ్రాలలో పెట్టుబడులు పెట్టినవే.
- జగతిలో ట్రైడెంట్ కంపెనీ రూ. 7 కోట్లు, అరబిందో ఎండీ రూ. 3 కోట్లు, హెటిరో గ్రూపు ఎండీ రూ. 4.5 కోట్లు, జనని ఇన్‌ఫ్రాలో రూ. 15 కోట్లు పెట్టుబడి పెట్టాయి.
- ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధికి ప్రతిగానే జగతి, జననిల్లో అరబిందో, హెటిరో గ్రూపు సంస్థలు, వాటికి చెందిన వ్యక్తులు పెట్టుబడులు పెట్టారు.

## ఇది తొలి ఛార్జిషీటు మాత్రమే


జగన్ అక్రమాస్తుల కేసులో మరికొన్ని అనుబంధ ఛార్జిషీట్లు త్వరలో దాఖలు కానున్నాయి. దాఖలు చేసిన ఛార్జిషీటు మొదటిదని సీబీఐ పేర్కొనడం గమనార్హం. ఈ కేసులో విజయసాయిరెడ్డి అరెస్టయి 90 రోజులు పూర్తవుతున్నందున సీబీఐ ఇప్పటి వరకు చేసిన దర్యాప్తు అధారంగా ఛార్జిషీటు దాఖలు చేసింది. ఇందులో ప్రధానంగా అరబిందో, హెటెరో గ్రూపు కంపెనీలనే ప్రస్తావిస్తూ 'క్విడ్ ప్రో కో' జరిగిన తీరును, అలా అందిన మొత్తాలను జగన్, విజయసాయిరెడ్డిలు పెట్టుబడులుగా ఎలా మార్చారో పేర్కొంది. సీబీఐ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లో 73 మంది నిందుతులను పేర్కొంది. పైసా ఆదాయం లేకుండా కోట్లు పెట్టుబడి పెట్టిన కంపెనీలు, కోట్లలో లబ్ధి పొందిన కంపెనీలను ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. ఈ కంపెనీలు ఏ రకంగా లబ్ధి పొందాయి? ఎంత పెట్టుబడి పెట్టాయి? ఇందులో ఇతర అధికారుల పాత్ర వంటివాటితో అనుబంధ ఛార్జిషీటు దాఖలు చేయనుంది. ప్రస్తుత ఛార్జిషీటులో కూడా నిత్యానందరెడ్డి భార్య కె.రాజేశ్వరి, సోదరుడు కె. ప్రసాదరెడ్డిల పాత్ర గురించి ప్రస్తావించినా కేసు నిత్యానందరెడ్డి ఖాతా నుంచి తీసుకున్న సొమ్ము నుంచి జగతిలో మూడు కోట్లు పెట్టుబడి పెట్టారని తెలిపింది.

**సాక్షులు 66 :** ప్రస్తుతం దాఖలు చేసిన ఛార్జిషీటులో 66 మందిని సాక్షులుగా పేర్కొంది. ఇందులో మొదటి 17 మంది ఏపీఐఐసీకి చెందిన అధికారులు కాగా, 18 నుంచి 22 వరకు అరబిందో గ్రూపు, 23 నుంచి 26 వరకు హెటెరో గ్రూపు, అనంతరం బ్యాంకు ఉద్యోగులు, సీబీఐ అధికారులను పేర్కొంది. ✶

# భూపందేరాలపై 'కాగ్' నివేదిక

**- కొన్ని ముఖ్యాంశాలు**

2006-11 మధ్యకాలంలో, రాష్ట్ర ప్రభుత్వం చేసిన భూబదలాయింపులు/ కేటాయింపులలో తీవ్రమైన అక్రమాలు చోటు చేసుకున్నాయి. రాష్ట్ర సామాజిక, ఆర్థిక ప్రయోజనాలను విస్మరించి, తాత్కాలిక ప్రాతిపదికన నిర్హేతుకంగానూ, తోచిన విధంగానూ, అతి తక్కువ ధరలకే భూములను ప్రైవేటు వ్యక్తులు / సంస్థలకు కేటాయించడం జరిగింది. ప్రభుత్వ వ్యవస్థాగత సోపానంలోని వివిధ స్థాయిల్లోని అధికార్లు ప్రతిపాదించిన రేట్లను పట్టించుకోకుండా ప్రైవేటు వ్యక్తులు/ సంస్థలకు అనుచిత లబ్ధిని చేకూర్చారు. మచ్చుకు తనిఖీ చేసిన కేసులలో, జిల్లా కలెక్టరు/సాధికార సంఘం సిఫార్సు చేసిన మార్కెట్ విలువకూ, ప్రభుత్వం భూములను బదలాయించిన రేట్లకూ వ్యత్యాసం ఉన్న కారణంగా వివిధ సంస్థలు, వ్యక్తులకు రూ. 1,784 కోట్ల అనుచిత లబ్ధి చేకూరిందని ఆడిట్ పరిశీలనలో వెల్లడయింది. భూకేయింపులకు సంబంధించిన చాలా కేసులలో నిర్దేశిత విధానాలకూ,ఆర్థిక ఔచిత్య సూత్రాలనూ ప్రభుత్వం పాటించలేదు.




**భూకేటాయింపులలో చోటుచేసుకున్న అక్రమాలలో కొన్ని ముఖ్యమైన వాటిని ఈ కింద వివరించడమైంది.**

- వై.ఎస్.ఆర్ జిల్లా, జమ్మలమడుగు మండలంలోని 3,115.64 ఎకరాలు భూమిని కమర్షియల్ ఎయిర్ పోర్టు, ఫ్లయింగ్ అకాడమీలను నెలకొల్పడానికి బ్రహ్మణి ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు కేటాయించడం జరిగింది. ఐతే కమర్షియల్ ఎయిర్ పోర్టుల స్థాపనకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వ విధానానికి విరుద్ధంగానూ, స్థలం అనుకూలతనూ, ప్రాజెక్టు మనుగడనూ పరిశీలించకుండానే ఈ కేటాయింపును చేసారు. అంతేకాకుండా ప్రతిపాదించిన కొత్త విమానాశ్రయం, కడప విమానాశ్రయం నుండి కేవలం 50 కి.మీ. దూరంలో మాత్రమే ఉందన్న వాస్తవాన్ని విస్మరించారు.
- ఇదే మండలంలోని 10,760.66 ఎకరాల భూమిని గ్రీన్ ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్‌ను స్థాపించడానికి బ్రహ్మణి ఇండస్ట్రీస్‌కు కేటాయించారు. ఇందులో చట్టవిరుద్ధంగా బదలాయించిన 674.58 ఎకరాల జలాశయ భూములు కూడా ఉన్నాయి. అంతేకాకుండా, గండికోట రిజర్వాయరు నుండి 2టి.ఎమ్.సి.ల నీటిని కూడా కేటాయించారు. ఐతే, పర్యావరణ అనుమతులు లేకుండానే, ప్రాజెక్టు నివేదికను పరిశీలించకుండానే ఈ కేటాయింపులను చేసేసారు. 2011 నవంబరు నాటికి ఈ ప్రాజక్టుకు సంబంధించి కనీసం మొదటి దశ నిర్మాణం కూడా పూర్తి కాలేదు.
- లేపాక్షి నాలెడ్జ్ హబ్ లిమిటెడ్ అనే డెవలపర్ సంస్థ అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడానికిముందే ఆ సంస్థ పేరున అనంతపురం జిల్లాలో 8,844.01 ఎకరాలకు అమ్మకపు దస్తావేజును ఏ.పి.ఐ.ఐ.సి. అక్రమంగా ఎక్జిక్యూట్ చేసింది. డెవలపర్ సంస్థ ఎలాంటి పరిశ్రమనూ స్థాపించలేదు, ఉద్యోగాలను కల్పించనూలేదు. కానీ, 4,397 ఎకరాల భూమిని కుదవపెట్టి బ్యాంకుల నుండి రూ. 790 కోట్ల రుణాన్ని పొందింది.
- ప్రభుత్వ భూములను అనధికారికంగా ఆక్రమించుకున్న 'ఓబుళాపురం మైనింగ్ కంపెనీ' (ఓ.ఎమ్.సి), 413.81 ఎకరాల భూమి లీజుకోసం చేసుకున్న విజ్ఞప్తిని అనంతపురం జిల్లా కలెక్టర్ 2008 ఆగస్టులో నిరాకరించారు. ఐతే, ఒక నెల తర్వాత జిల్లా కలెక్టరు దీనికి విరుద్ధంగా, ఏ.పి.ఐ.ఐ.సి. విజ్ఞప్తి మేరకు, పారిశ్రామిక వాడను ఏర్పాటు చేసేందుకు 304.66 ఎకరాలను (ఓ.ఎమ్.సి. కి బదిలీ చేయడానికి) ఎ.పి.ఐ.ఐ.సి. కి బదలాయించాలని సిఫార్సు చేసారు. ఐతే, భూములు లీజు/బదలాయింపు అంశంలో మొదట

తీసుకున్న నిర్ణయాన్ని మార్చుకోవడానికి గల కారణాలు రికార్డుల్లో లేవు.

- రంగారెడ్డి జిల్లా, మామిడిపల్లి గ్రామంలోని 881.32 ఎకరాలను ప్రభుత్వం, స్వల్ప ధరకే ఎ.పి.ఐ.ఐ.సి.కి బదలాయించడం వలన రూ. 874.03 కోట్ల రాబడిని ప్రభుత్వ కోల్పోయింది. బదలాయింపు ఉత్తర్వులు రాకముందే దీంట్లో 500 ఎకరాలను ఎ.పి.ఐ.ఐ.సి., అతి తక్కువ ధరకే 'ఇందు టెక్ జోన్, బ్రహ్మణి ఇన్ఫ్రాటెక్' సంస్థలకు కేటాయించింది.
- వాన్‌పిక్‌తో చేసుకున్న ఒప్పందం, ఆ సంస్థకు చేసిన భూబదలాయింపు ప్రక్రియల్లో చట్టబద్ధత కానీ, పారదర్శకత కానీ లేవు. అంతేకాకుండా, ఒప్పందంలోని నిబంధనలను సవరించడానికి ప్రభుత్వానికి కనీస వెసులుబాటు కూడా లేకుండా, ఒప్పందంలోని షరతులన్నీ వాన్‌పిక్ సంస్థకే పూర్తిగా అనుకూలంగా ఉండడం వలన ఆర్థికంగా, న్యాయపరంగా ప్రభుత్వానికి ఇబ్బందులున్నాయి.
- కె.రహేజా ఐటి పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ (కె.ఆర్.ఐ.టి.పి.ఎల్.) తో ఎ.పి.ఐ.ఐ.సి చేసుకున్న ఒప్పందంలోని షరతులు, ఈ కంపెనీ 110 ఎకరాల ప్రభుత్వ భూమిని అమ్ముకోవటానికీ/ తాకట్టు పెట్టటానికీ వీలుకల్పించి, ప్రభుత్వాన్ని ఆర్థికపరమైన ఇబ్బందులకు గురిచేసింది.
- మార్కెట్ విలువ రూ.18 లక్షలుండగా అప్పటి ముఖ్యమంత్రి ఆదేశాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ 250 ఎకరాల భూమిని ఎకరం రూ. 1.50 లక్షల వంతున జార్జియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (జి.ఐ.టి.) కి కేటాయించి రూ.41.25 కోట్ల అనుచిత ప్రయోజనం కల్పించింది. జి.ఐ.టి. భూమి ఖరీదు ఇంకా చెల్లించవలసి ఉంది.
- రంగారెడ్డి జిల్లాలో అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ సెంటర్, స్టార్ హోటల్, గోల్ఫ్‌కోర్స్, బహుళ ప్రయోజన టౌన్‌షిప్‌లతో కూడిన ఒక సమీకృత ప్రాజక్టును ఏర్పాటు చేయటానికి ఎమార్ ప్రాపర్టీస్ పి.జె.ఎస్.సి దుబాయికి (ఎ.పి.ఐ.ఐ.సి. ద్వారా) ప్రభుత్వ 535 ఎకరాల స్థల కేటాయించింది. ఐతే, ఎమార్‌తో కుదుర్చుకున్న ఎమ్.ఓ.యు. ప్రకారం ఏర్పాటైన ఎస్.పి.వి. ఈ ప్రాజక్టును అభివృద్ధి చేసే హక్కులను ప్రభుత్వ సమ్మతి లేకుండానే తమ సహ సంస్థలకు అప్పగించింది. దీనివలన ఎ.పి.ఐ.ఐ.సి/ ప్రభుత్వ ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం, అభివృద్ధి అవసరాల కోసం భారీగా పెట్టుబడి పెట్టినప్పటికీ, వీటిపై తన నియంత్రణను కోల్పోయింది.
- శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, చిల్లకూరు మండలంలోని భూమిని పారిశ్రామిక వాడ ఏర్పాటు కోసం సింహపురి ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్, వికాస్ పవర్ లిమిటెడ్ అనే సంస్థలకూ, రెండు విద్యుత్ ప్రాజెక్టుల స్థాపన కోసం సింహపురి ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్, మీనాక్షి ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ అనే సంస్థలకూ, ఏ.పి.ఐ.ఐ.సి. ద్వారా, అతి తక్కువ ధరలకే కేటాయించడం వలన ప్రభుత్వానికి వరుసగా రూ.72.07 కోట్లు, రూ. 39.60 కోట్లు రెవెన్యూ నష్టం జరిగింది.
- 20.06 ఎకరాల భూమిని అనధికారికంగా ఆక్రమించుకున్న బళ్ళారి ఐరన్ ఓర్ లిమిటెడ్‌పై అనంతపురం జిల్లా కలెక్టరు చర్య తీసుకోలేదు. పైగా, మరో 50.69 ఎకరాల అదనపు భూమి కోసం ఆ సంస్థ చేసుకున్న దరఖాస్తుకు అనుకూలంగా వ్యవహరించి, ఆ సంస్థ ఇచ్చిన రూ.0.63 కోట్ల మొత్తాన్ని ప్రభుత్వ ఆమోదం రాకుండానే, తిరిగి స్వాధీనం చేసుకున్న భూముల తాలూకు ఆసైనీలకు (అవార్డు మొత్తాలుగా) చెల్లించారు.
- 2003-04 నుండి 2010-11 మధ్య కాలంలో భూబదలాయింపులను పొందిన సంస్థలకు సంబంధించి 60 కేసులలో, భూబదలాయింపు తాలూకు రూ.2,559 కోట్ల మొత్తాన్ని జిల్లా కలెక్టర్లు ఇంకా వసూలు చేయలేదు.

## ఏ.పి.ఐ.ఐ.సి. ద్వారా భూముల కేటాయింపులు

2006-11 మధ్య కాలంలో, రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి కోసం ప్రభుత్వం 34,000 ఎకరాల భూములను ఏ.పి.ఐ.ఐ.సి. సంస్థకు లేదా ఈ సంస్థ ద్వారా వేరే సంస్థలకు కేటాయించింది. ఐతే, ప్రభుత్వం వేల ఎకరాలను ఏ.పి.ఐ.ఐ.సి.కి బదలాయించినప్పటికీ, రాష్ట్రంలో లక్ష్యిత పారిశ్రామికీకరణను సాధించే దిశగా ఆ సంస్థ, ప్రభుత్వానికి తోడ్పడలేదు. అభివృద్ధి ఒప్పందాలను చేసుకోవడంలోనూ వివిధ పారిశ్రామిక సంస్థలకు భూములను కేటాయించడంలోనూ ఏ.పి.ఐ.ఐ.సి., ప్రభుత్వ ప్రయోజనాలను కాపాడకపోవడమేకాకుండా, ఆ భూముల అంతిమ వినియోగాన్ని కట్టుదిట్టంగా పర్యవేక్షించడంలో కూడా విఫలమవ్వడం వలన ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లింది.

ప్రవేటు డెవలపర్‌లు తమ స్థిరాస్తి వ్యాపారాన్ని వృద్ధి

చేసుకోడానికి ప్రభుత్వ భూములను వినియోగించుకునేలా ఏ.పి.ఐ.ఐ.సి. వీలుకల్పించడం వలన, సమాచార – సాంకేతిక మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని, ఉపాధి అవకాశాలు కల్పించాలనీ ఆశించిన లక్ష్యం నెరవేరలేదు. ఈ ప్రైవేటు సంస్థలు ప్రభుత్వ భూములను తాకట్టు పెట్టడానికీ, అమ్మడానికీ అనుమతించడంలో ఏ.పి.ఐ.ఐ.సి., ప్రభుత్వ ప్రయోజనాలను కాపాడలేకపోయింది. అంతేకాకుండా, ప్రభుత్వాన్ని ఆర్థిక ఇబ్బందులకు గురిచేసింది.

### సెజ్‌ల ద్వారా ఉపాధి అవకాశాల కల్పన

పారిశ్రామిక వాడలు, ప్రత్యేక ఆర్థిక మండళ్లను అభివృద్ధి చేసి పారిశ్రామిక మౌలిక వసతులను పెంపొందించే బాధ్యతను ఏ.పి.ఐ.ఐ.సి.కి అప్పగించారు. వందల ఎకరాలను సెజ్‌లు, ఐ.టి./ పారిశ్రామిక వాడల ఏర్పాటు కోసం బదలాయించినప్పటికీ ఆశించిన లక్ష్యం నెరవేరలేదు.

- 11 సెజ్‌లు/ఐ.టి. పార్కులు ఆశించినమేరకు ఉపాధి అవకాశాలను కల్పించలేదు. 5.93 లక్షల ఉద్యోగాలను కల్పించాలనే లక్ష్యానికిగానూ, నాలుగు సెజ్‌లు కనీసం ఒక్క ఉద్యోగాన్ని కూడా కల్పించలేదు. మిగిలిన ఏడు సెజ్‌లు గత నాలుగైదేళ్ళలో కేవలం 0.26 లక్షల ఉద్యోగాలను మాత్రమే కల్పించాయి.

### కేటాయించిన అవసరాలకు భూములను వినియోగించకపోవడం

- విశాఖపట్నంలో 'హెల్త్ సిటీ'ని ఏర్పాటు చేయడానికి పది హాస్పిటళ్ళకు ఏ.పి.ఐ.ఐ.సి. ప్లాట్లను కేటాయించి, ప్రాజెక్టులను రెండేళ్ళలో పూర్తి చేయాలనీ, ఔట్‌పేషెంట్లుగా వచ్చేవారిలో 10శాతం చొప్పున పేదలకూ, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకూ ఉచిత వైద్య సేవలను కల్పించాలనీ నిబంధన విధించింది. ఐతే, 2011 జూలై నాటికి, ఈ సంస్థల్లో ఏ ఒక్కటీ ఆశించినవిధంగా హాస్పిటళ్ళను ఏర్పాటు చేయలేదు.
- రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం లోని హార్డ్‌వేర్ పార్కులో 615.43 ఎకరాలను 2000 జూన్ – 2010 జూన్ మధ్య కాలంలో 58 యూనిట్లకు కేటాయించారు. ఇందులో 36 యూనిట్లు తమ ప్రాజెక్టులను అమలు చేయలేదు. పెట్రోలు బంకు, కార్యాలయం, హోటళ్ళ వంటి వాణిజ్య అవసరాల కోసం 5 యూనిట్లకు 11.97 ఎకరాలను అక్రమంగా ఇచ్చేందుకు అనుమతించడం జరిగింది.
- వివిధ ప్రయోజనాల కోసం 2010కి ముందు చేసిన 25 భూకేటాయింపులలో పొందిన 5,520.28 ఎకరాలను వినియోగించలేదని రికార్డులను మచ్చుకు తనిఖీ చేసినపుడు కనుగొన్నాము.

### పర్యావరణ పరిరక్షణ నిబంధనల ఉల్లంఘన

- రాష్ట్ర ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలనూ, తన స్వంత ఉత్తర్వులనూ ఉల్లంఘిస్తూ, శ్రీకాకుళం జిల్లా, సోంపేట మండలంలో 972.69 ఎకరాల జలాశయాన్ని నాగార్జునా కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఇన్‌ఫ్రాస్టక్చర్ హోల్డింగ్స్ లిమిటెడ్ అనే సంస్థకు బదలాయించింది. (కేటాయించిన మొత్తం భూమి : 1046.21 ఎకరాలు)
- రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ మండలంలో కాలుష్యరహిత పరిశ్రమల కోసం కేటాయించిన ప్రాంతాల్లో తాత్కాలిక మైనింగ్ లీజులను అక్రమంగా మంజూరు చేసారు.

### చట్టవిరుద్ధమైన ఆక్రమణలు

ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించుకోవడాన్ని నిరోధించేందుకూ, కనుగొనేందుకూ, ఓ యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి, సత్వర చర్యలు చేపట్టడానికీ, కట్టుదిట్టంగా వ్యవహరించడానికీ బదులు ప్రభుత్వ భూములు ఆక్రమణల విషయంలో ప్రభుత్వం మౌన ప్రేక్షక పాత్ర వహించింది. పైగా రూ. 63.71 కోట్ల స్వల్ప మొత్తాన్ని మాత్రమే వసూలు చేసి 21 లక్షల చదరపు గజాల స్థలాల్లోని 14,878 అనధికార ఆక్రమణలను క్రమబద్ధీకరించడం ద్వారా, ఒక రకంగా వీటికి ఆజ్యం పోసింది.

- ఎకరానికి రూ.25 లక్షల చొప్పున జిల్లా కలెక్టరు సిఫార్సు చేయగా, ఎకరా రూ.5 లక్షలకే 25.72 ఎకరాలను హైదరాబాద్‌లోని అరబిందో ఫార్మ లిమిటెడ్‌కు ప్రభుత్వం క్రమబద్ధీకరించింది/ కేటాయించింది. ఐతే, ఈ కేటాయింపు/క్రమబద్ధీకరణ చేసేటప్పుడు 20.48 ఎకరాలు (25.72 ఎకరాలలో) అప్పటికే అరబిందో ఫార్మా లిమిటెడ్ ఆక్రమణ కింద ఉందన్న వాస్తవాన్ని ప్రభుత్వం విస్మరించింది.
- రంగారెడ్డి జిల్లా, సరూర్‌నగర్ మండలంలో 103.21 ఎకరాల భూమిని ఏ.పి.ఐ.ఐ.సి.కి అప్పగించడం కోసం, అందులోని ఆక్రమణదార్లను ఖాళీ చేయించడానికి రూ.825 కోట్లను ఎక్స్‌గ్రేషియా రూపేణా ప్రభుత్వం చెల్లించింది.
- ప్రభుత్వం ఘజియాబాద్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీకి రూ. 15 కోట్ల విలువైన 30 ఎకరాల భూమికి రాయితీ ధరను వర్తింపచేసి రూ.45 లక్షలకే బదలాయించింది. మరోపక్క ఈ కేటాయింపు కోసం తన స్వంత భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ఆక్రమణదార్లకు రూ.26.43 లక్షలను చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. ★

# ఉప ఎన్నికల కలకలంలో ప్రధాన పార్టీలు

- డి.వి.వి.యస్. వర్మ

మార్చి18న ఆరు రాష్ట్రాలలో 11 అసెంబ్లీ స్థానాలకు, ఒక పార్లమెంటు స్థానానికి ఉపఎన్నికలు జరిగాయి. సంఖ్యారీత్యా ఈ ఉప ఎన్నికలకు అంత ప్రాధాన్యత లేదు కాని ఇవి కొన్ని రాష్ట్రాలలో ప్రధాన పార్టీలలో కలకలం సృష్టిస్తున్నమాట నిజం. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఏడు ఉపఎన్నికల ఫలితాలను పరిశీలించే ముందు ఇతర రాష్ట్రాలలో జరిగిన ఉపఎన్నికలను పరిశీలించుకోవడం అవసరం.

## గత తీర్పుదారిలో

తమిళనాడులో శంకరన్ కోవిల్ అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికలలో అన్నాడియంకె పార్టీ అభ్యర్థి దాదాపు 64 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. తమిళనాడు అసెంబ్లీకి 2011 మే లోనే ఎన్నికలు జరిగాయి. అప్పుడు ప్రజలు కరుణానిధి ప్రభుత్వంమీద పగ తీర్చుకున్నారు. ఆ తరువాత పట్టుమని పది మాసాలు నిండకమునుపే వచ్చిన ఈ ఉపఎన్నిక ఫలితం అందరూ ఊహించిందే. ఇది జయలలిత ప్రభుత్వం మీద తీర్పు కాదు, గత తీర్పుకు కొనసాగింపుగానే చూడాల్సి వుంటుంది.

కేరళలో పిరవోం నియోజకవర్గంలో జరిగిన ఉపఎన్నికలలో ప్రస్తుతం అధికారంలో వున్న యునైటెడ్ డెమోక్రాటిక్ ఫ్రంట్ అభ్యర్థి సుమారు 12 వేల ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. తమిళనాడుతో పాటు కేరళ అసెంబ్లీకి కూడా గత సంవత్సరమే ఎన్నికలు జరిగాయి. మార్క్సిస్టు పార్టీ తన అంతర్గత కుమ్ములాటలతో ఓటమిని స్వయంకృతాపరాధంగా కొనితెచ్చుకుంది. ఈ ఫలితం కూడా గత తీర్పుకు కొనసాగింపే తప్ప యు.డి.యఫ్ ప్రభుత్వానికి సమర్థనగా భావించలేం.

## భవిష్యవాణి



ఇక ఒడిషా రాష్ట్రంలో అతాఫుర్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలలో బిజూజనతాదళ్ అభ్యర్థి 47 వేల ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ వార్తలలో కనిపించకపోయినా ప్రజల హృదయాలలో స్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నట్లు కనిపిస్తున్నది. ఆయన సాధిస్తున్న వరుస విజయాలు దీనిని స్పష్టపరుస్తున్నాయి. ఒడిషా అసెంబ్లీకి 2014లో ఎన్నికలు రాబోతున్నాయి. రాబోయే ఎన్నికలకు ఈ ఉప ఎన్నికల ఫలితం సూచికగా భావించడం పొరపాటు కాబోదు. ఒకపక్క ప్రభుత్వ వ్యతిరేకత లేకపోగా ఇంత భారీ మెజారిటీ సాధించడం ఆ ప్రభుత్వం పట్ల ప్రజలలో సానుకూలతను ఈ ఫలితం ప్రకటిస్తున్నది.

కర్నాటకలో 2008లో జరిగిన ఎన్నికలలో అనూహ్యంగా

**కేరళ : పిరవోం అసెంబ్లీ నియోజకవర్గం**

| | | |
|---|---|---|
| మొత్తం ఓట్లు | 1,83,170 | |
| పోలైన ఓట్లు | 1,58,260 | |
| పార్టీ | ఓట్లు | శాతం |
| కేరళ కాంగ్రెస్(యుడిఎఫ్) | 82,756 | 52.29 |
| సిపిఐ(ఎం) | 70,685 | 44.66 |
| బి.జె.పి | 3,241 | 2.0 |

**తమిళనాడు :శంకరన్‌కోవిల్ అసెంబ్లీ నియోజకవర్గం**

| | | |
|---|---|---|
| మొత్తం ఓట్లు | 2,06,087 | |
| పోలైన ఓట్లు | 1,59,772 | |
| పార్టీ | ఓట్లు | శాతం |
| అన్నాడియంకె | 94,977 | 59.44 |
| డియంకె | 26,220 | 16.41 |
| ఎండిఎంకె | 20,678 | 12.94 |

**ఒడిషా : అతాఘర్ అసెంబ్లీ నియోజకవర్గం**

| | | |
|---|---|---|
| మొత్తం ఓట్లు | 1,85,317 | |
| పోలైన ఓట్లు | 1,32,977 | |
| పార్టీ | ఓట్లు | శాతం |
| కాంగ్రెస్ | 40,214 | 30.24 |
| బి.జె.పి | 2,377 | 1.7 |
| బిజూజనతాదళ్ | 87,604 | 65.87 |

| కర్నాటక: ఉడిపి–చిక్‌మగలూర్ పార్లమెంట్ నియోజకవర్గం | | |
|---|---|---|
| మొత్తం ఓట్లు | 12,52,390 | |
| పోలైన ఓట్లు | 8,52,824 | |
| పార్టీ | ఓట్లు | శాతం |
| కాంగ్రెస్ | 3,98,723 | 46.75 |
| బి.జె.పి | 3,52,999 | 41.40 |
| జనతాదళ్ (యస్) | 72,080 | 8.45 |

విజయం సాధించిన బి.జె.పి. ప్రభుత్వం కష్టకాలంలో వుందన్న విషయం అందరికీ తెలిసిందే. ముఖ్యమంత్రి యడ్యూరప్ప ఆ పార్టీ విజయానికి ఎంతగా దోహదపడ్డారో ఇప్పుడు దాని పతనానికి అంతగా కారకులయ్యారు. కర్నాటకలో అధికార కుమ్ములాటలు తప్ప అర్థవంతమైన పాలన ఇచ్చే గట్టిప్రయత్నం ఏదీ జరగలేదు. కర్నాటకలో ఉడిపి – చిక్ మగలూర్ పార్లమెంటు స్థానానికి జరిగిన ఉపఎన్నికలలో బి.జె.పి. పరాజయం పాలైంది. 2009 పార్లమెంటు ఎన్నికలలో 26 వేల ఓట్ల తేడాతో బి.జె.పి గెలుచుకోగా ఇప్పుడు 40 వేల ఓట్ల తేడాతో ఓడిపోయింది.

2013 ప్రారంభంలో రానున్న ఎన్నికల్లో అక్కడ బి.జె.పి.కి ఎదురుదెబ్బలు తప్పవని, దక్షిణాదిన బి.జె.పికి అరుదుగా లభించిన అవకాశాన్ని అది చేజార్చుకోనున్నట్లు ఈ ఉప ఎన్నిక ఫలితం సూచిస్తున్నది.

యడ్యూరప్ప, గాలిసోదరుల వ్యవహారం బి.జె.పికి జాతీయస్థాయిలోనే నష్టాన్ని కలిగించింది. అవినీతి కుంభకోణాలలో చిక్కుకున్న కాంగ్రెస్‌ను రాజకీయంగా వెలి వెయ్యడానికి జాతీయ స్థాయిలో బి.జె.పి చేస్తున్న ప్రయత్నాలకు ప్రస్తుత కర్నాటక ప్రభుత్వం, గతం లోని ఉత్తరాఖండ్‌లే ప్రభుత్వాలే ఆటంకాలు అయ్యాయి.

కర్నాటకలో ముఖ్యమంత్రిని మార్చి కొత్తరూపు ఇవ్వాలన్న ప్రయత్నాలను యడ్యూరప్ప సాగనివ్వడం లేదు. కర్నాటకలో రాజకీయం కులాల చుట్టూ తిరుగుతున్నది. ఇక్కడ కులపరమైన స్వామీజీలు, మఠాలు రాజకీయంలో ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. ఇటీవల లింగాయత్ స్వామీజీలు యడ్యూరప్పకు అనుకూలంగా బహిరంగ ప్రదర్శనలు కూడా నిర్వహించారు. ఈ బలంతోనే యడ్యూరప్ప బి.జె.పితో బేరసారాలు సాగించగలుగుతున్నారు. ఆయన తాత్కాలికంగా తిరిగి అధికారం పొందవచ్చును గాని వచ్చే ఎన్నికల్లో బి.జె.పిని గెలిపించడం సాధ్యం కాకపోవచ్చుననేది ఈ పార్లమెంటు ఉపఎన్నికల ఫలితం స్పష్టం చేస్తున్నది.

| గుజరాత్ : మాన్సా అసెంబ్లీ నియోజకవర్గం | | |
|---|---|---|
| మొత్తం ఓట్లు | 1,65,936 | |
| పోలైన ఓట్లు | 1,25,680 | |
| పార్టీ | ఓట్లు | శాతం |
| కాంగ్రెస్ | 64,776 | 51.54 |
| బి.జె.పి | 56,584 | 44.99 |

## గుజరాత్‌లో అనూహ్యం



మోడీ కంచుకోటగా భావిస్తున్న గుజరాత్‌లో మాన్సా నియోజకవర్గానికి జరిగిన ఉపఎన్నికలలో బి.జె.పి. పరాజయం అనూహ్యమైంది. 1995 నుండి ఈ నియోజకవర్గం బి.జె.పి. చేతుల్లో వుంది. 2007 నుండి ఏ ఉప ఎన్నికలలోనూ బి.జె.పి అపజయాన్ని చవిచూడలేదు. కాని ఈ ఉప ఎన్నికలలో 8 వేల మెజారిటీతో కాంగ్రెస్ విజయం సాధించడం మోడీకి మింగుడుపడని అంశం కానుంది.

2012 డిసెంబరులో అంటే కొన్ని నెలలలోనే గుజరాత్ అసెంబ్లీకి ఎన్నికలు రానున్నాయి. మోడీ గుజరాత్‌లో సాధించే విజయాల మీదే ప్రధాని పదవి మీద ఆయన పెట్టుకున్న ఆశలు చిగురిస్తాయి. గుజరాత్ రాజధాని గాంధీనగర్ మున్సిపల్ ఎన్నికలలో మోడీ ఘనవిజయాన్ని సాధించారు. కాని దాని పరిధిలో వున్న మాన్సా నియోజకవర్గంలో ఈ పరాజయం సంభవించింది. మోడీకి హిందూత్వవాద ముద్ర వుంది. కాని గుజరాత్‌లో ఆయన విజయానికి అదే కారణంగా చాలామంది భావించారు. ఆ ముద్రను ఆయన చెరుపుకోవాలనుకోలేదు. వీలైనప్పుడల్లా దానిని వినియోగిస్తూనే వచ్చారు. అందుచేత ఈ ఓటమికి దానిని ముడిపెట్టకూడదు. గుజరాత్‌లో ఒక కొత్త అభివృద్ధి నమూనాకు శ్రీకారం చుట్టినవాడుగా పత్రికలు, రాజకీయ విశ్లేషకులు మోడీని ప్రస్తుతిస్తూ వస్తున్నారు. ఈ అభివృద్ధి నమూనా పట్ల ప్రజల వైఖరి ఏమిటి అన్నదానిని వారు విస్మరిస్తూవచ్చారు. ఈ ఉపఎన్నిక ఫలితాన్ని ఆ కోణం నుండి పరిశీలించుకోవాల్సివుంది. మానవీయకోణం లేని అభివృద్ధి నమూనాలను ప్రజలు తిరస్కరిస్తున్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడు అభివృద్ధి నమూనాను అందరూ ఆకాశానికి

ఎత్తారు. కాని ఎన్నికల్లో ఫలితాలు దానికి భిన్నంగా వచ్చాయి. ఈ ఉపఎన్నికల ఫలితం అలాంటి సంకేతాన్ని ఇస్తుందన్న అనుమానానికి తావిస్తున్నది.

**రాష్ట్రంలో సంధిదశ**

ఆంధ్రప్రదేశ్‌లో 7 నియోజకవర్గాలలో ఉపఎన్నికలు జరిగాయి. ఇందులో 6 స్థానాలు తెలంగాణా ప్రాంతంలో, ఒకటి కోస్తా జిల్లాలలో వున్నాయి. తెలంగాణా ప్రాంతంలో వున్న 6 స్థానాలలో మహబూబ్‌నగర్‌లో స్వతంత్రంగా గెలిచిన అభ్యర్థి మరణంతో జరిగింది. మిగిలిన 5 స్థానాలలో గతంలో తెలుగుదేశం అభ్యర్థులుగా గెలిచిన ముగ్గురు తెలంగాణా పట్ల తమ పార్టీ వైఖరిని వ్యతిరేకిస్తూ ఆ పార్టీని వీడి ఉద్యమంబాట పట్టినవారు. అందులో ఇద్దరు తెరాసలో చేరారు. అలాగే కాంగ్రెస్ పార్టీని వీడిన ఇద్దరు తెరాసలో చేరారు. ప్రత్యేక రాష్ట్రం కోసం తమ పార్టీని, శాసనసభ సభ్యత్వాన్ని త్యాగం చేసిన వారుగా ఎన్నికల బరిలో నిలబడ్డారు. తెలంగాణా ప్రాంతంలో ప్రత్యేక రాష్ట్రం కోసం ఆందోళనలో ఉద్యమాల ఉధృతి తగ్గిన నేపథ్యంలో కాంగ్రెస్ తెదెపాలు ఈ ఉప ఎన్నికలలో కొన్ని ఫలితాలు వస్తాయని భావించారు. కొన్ని ఓట్లు పెంచుకోగలిగారు తప్ప ఎక్కడా గెలుపు సాధించలేకపోయారు. మహబూబ్‌నగర్‌లో తెరాసతో పోటీపడి బి.జె.పి విజయాన్ని

**కామారెడ్డి**

మొత్తం ఓట్లు 2,03,143
పోలైన ఓట్లు 1,37,051

| పార్టీ | ఓట్లు | శాతం |
|---|---|---|
| తెరాస | 75,699 | 55,23 |
| కాంగ్రెస్ | 31,234 | 22.79 |
| తెదేపా | 17,839 | 13.01 |
| 6 గురు స్వతంత్రులు | 12,279 | 8.95 |

★ తెదేపా ధరావతు దక్కలేదు

**ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం**

మొత్తం ఓట్లు 1,72,131
పోలైన ఓట్లు 1,20,502

| పార్టీ | ఓట్లు | శాతం |
|---|---|---|
| తెరాస | 59,452 | 49.33 |
| కాంగ్రెస్ | 28,056 | 23,28 |
| తెదేపా | 24,288 | 20,15 |
| సీపీఎం | 2423 | 2.01 |
| **ఇద్దరు స్వతంత్రులకు** | **6,283** | **5.21** |

# యధాతథ స్థితికి వ్యతిరేక ఓటు: జేపీ

ప్రజలు యధాతథ పరిస్థితిని తిరస్కరిస్తున్నారుగానీ సరైన ప్రత్యామ్నాయం గురించి ఆలోచించటం లేదని ఆంధ్రప్రదేశ్‌లోని ఏడు అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల ఫలితాలు సూచిస్తున్నాయని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను మూడు దశాబ్దాలుగా పరిపాలిస్తున్న కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలను ప్రజలు నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నట్టు ఈ ఎన్నికల ఫలితాలు రుజువుచేస్తున్నాయన్నారు.

లోక్‌సత్తా పార్టీ తన సందేశాన్ని రాజ్యాంగబద్ధంగా ప్రజలలోకి తీసుకెళ్లి తన నూతన రాజకీయ ఎజెండాకు ఓట్ల రూపంలో మద్దతును కోరిందని జేపీ అన్నారు. "అయితే రాష్ట్రంలో రాజకీయ మోహరింపు ఎంత తీవ్రంగా ఉందంటే... హేతుబద్ధ వాదనలకు, నైతిక రాజకీయాలకు ప్రస్తుతం చోటు దొరకటం లేదు" అన్నారు.

ఎన్నికల ఫలితాలతో సంబంధం లేకుండా ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు లోక్‌సత్తా పార్టీ తన కృషిని శాయశక్తులా కొనసాగిస్తుందని స్పష్టంచేశారు.

దిగజారుడు రాజకీయాలకు సంకేతంగా మారకుండా ఆంధ్రప్రదేశ్‌ను నిరోధించాలంటే ఓ అద్భుతం జరగాల్సిందేనని జేపీ అన్నారు. దశాబ్దాలపాటు అవకాశవాద రాజకీయాలు, అవినీతి, రాజకీయ వ్యవస్థ రెండు శిబిరాలుగా చీలిపోవటం, లక్ష్యం లేని అధికారం ఇవన్నీ కలిసి ఈవేళ రాష్ట్రాన్ని పెను సంక్షోభంలోకి నెడుతున్నాయన్నారు.

"కానీ అద్భుతాలు వాటంతటవే జరగవు. అవి జరిగేలా చేయాలి. అన్ని పార్టీలలో విజ్ఞత కలిగిన నేతలు, మధ్యతరగతి వర్గాలు, మహిళలు, యువత సహా సమాజం పట్ల స్పందన కలిగిన పౌరులంతా దిగజారుగుతున్న ప్రస్తుత రాజకీయాల పట్ల సమీక్ష చేసుకోవాలి. పరిస్థితిని మార్చటానికి చేతులు కలపాలి. ఈ ఎన్నికల ఫలితాలు ఓ మేలుకొలుపు కావాలి" అని జయప్రకాష్ నారాయణ్ బుధవారం ఒక ప్రకటనలో అన్నారు.



సాధించింది. అక్కడ బి.జె.పి.కి అనేక అంశాలు కలిసి వచ్చాయి. వాటిని బి.జె.పి తన విజయానికి సద్వినియోగం చేసుకుంది. మొత్తానికి తెలంగాణాలో ఆందోళనలు తగ్గినా

| కోవూరు | | |
|---|---|---|
| మొత్తం ఓట్లు | 2,09,739 | |
| పోలైన ఓట్లు | 1,75,913 | |
| పార్టీ | ఓట్లు | శాతం |
| వైఎస్సార్సీపీ | 73,876 | 41.99 |
| తెదేపా | 50,382 | 28.64 |
| కాంగ్రెస్ | 41,397 | 23.53 |
| సీపీఎం | 3,562 | 2.02 |
| లోక్‌సత్తా | 1585 | 0.90 |
| మిగిలిన 9 మంది అభ్యర్థులకు | 5,111 | 2.90 |

| కొల్లాపూర్ | | |
|---|---|---|
| మొత్తం ఓట్లు | 1,95,865 | |
| పోలైన ఓట్లు | 1,51,030 | |
| పార్టీ | ఓట్లు | శాతం |
| తెరాస | 58,107 | 38.47 |
| కాంగ్రెస్ | 43,083 | 28.52 |
| తెదేపా | 35,287 | 23.36 |
| సీపీఎం | 3,905 | 2.58 |
| స్వతంత్రులకు | 10,648 | 7.05 |

| స్టేషన్ ఘన్‌పూర్ | | |
|---|---|---|
| మొత్తం ఓట్లు | 2,21,499 | |
| పోలైన ఓట్లు | 1,69,908 | |
| పార్టీ | ఓట్లు | శాతం |
| తెరాస | 81,279 | 47.83 |
| తెదేపా | 48,641 | 28.62 |
| కాంగ్రెస్ | 28,965 | 17.04 |
| సీపీఎం | 4,788 | 2.81 |
| స్వతంత్ర అభ్యర్థి | 6,234 | 3.66 |

తెలంగాణా వాంఛ, సెంటిమెంటు ఇంకా బలంగానే వుందనడాన్ని ఈ ఉప ఎన్నికల ఫలితాలు రుజువు చేస్తున్నాయి. దీనికి తోడు రాష్ట్రంలో పాలన నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులు, అస్థిరత్వం, ప్రభుత్వ విధానాలపై వ్యతిరేకత తోడైనట్లు కనిపిస్తున్నది.

నెల్లూరు జిల్లా కోవూరులో జరిగిన ఉపఎన్నిక రాష్ట్ర రాజకీయంలో మరో కొత్త కోణాన్ని ఆవిష్కరించింది. దివంగత ముఖ్యమంత్రి పేరుతో ఆయన తనయుడు జగన్ తనకు వారసత్వాన్ని కట్ట బెట్టాలంటూ ప్రారంభమైన పార్టీ విజయాన్ని సాధించింది. గత ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిగా విజయాన్ని సాధించిన అభ్యర్థే ఆ పార్టీని వీడి జగన్ పార్టీలో చేరి ఈ ఉప ఎన్నికలలో పోటీ చేశారు. జగన్ పార్టీ అటు కాంగ్రెస్‌ను ఇటు తెలుగుదేశం ఓట్లనీ కొల్లగొట్టి భారీ మెజారిటీతో గెలుపు సాధించారు. ఒక పక్క జగన్ ఆస్తులమీద, రాజశేఖర్ రెడ్డి హయాంలో జరిగిన అక్రమ పందేరాల పైనా కేసులు, విచారణలు, అరెస్టులు సాగుతున్నా, నిరంతరం పత్రికలు వీటిని ప్రచారం చేస్తున్నా, ప్రజలు ఈ ఉప ఎన్నికలో ఇలాంటి తీర్పునివ్వడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈ ఉప ఎన్నికలు రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ అనిశ్చితికి అద్దం పడుతున్నాయి. ఒకపక్క తెలంగాణా సమస్యకు ఒక పరిష్కారాన్ని కనుగొనకుండా నాన్చడంతో రాజకీయాన్ని అది భావోద్వేగభరితం చేస్తున్నది.

మరొక పక్క అధికారంలో వున్న కాంగ్రెస్‌పార్టీ తన పార్టీని, ప్రభుత్వాన్ని ఏక ముఖంగా నడిపించుకోలేని స్థితి ఈ అస్థిరత్వాన్ని పెంచు తున్నది. ప్రధాన ప్రతిపక్షం తెదేపా అధికారం కోసం ఆరాటపడడమే తప్ప ఎలాంటి విశ్వసనీయతను ప్రజలలో కల్పించలేకపోతున్నది. అధికార పక్షం పాలించలేని స్థితిలో వుండగా, ప్రతిపక్షం అధికారంలోకి రాలేని స్థితి నెలకొంది. ఇది ఆంధ్రప్రదేశ్‌లో ఒక విచిత్రమైన రాజకీయ శూన్యస్థితిని కల్పించింది. అందుకే ప్రజలు ఈ రెండు పార్టీలను ఉప ఎన్నికల్లో తిరస్కరిస్తున్నారు. వారు కొత్త ప్రత్యామ్నయాలకు, పరిష్కారాలకు ప్రయత్నిస్తున్నారు. దొరికిన ఆయుధంతో ఈ పార్టీల ఓటమికి దోహదపడుతున్నారు. ఇలాంటి నేపథ్యంలో నైతిక హేతుబద్ధ రాజకీయాలు విస్మరణకు గురవుతాయి. సంప్రదాయ రాజకీయ పార్టీలు సంక్షోభంలో పడతాయి. భావోద్వేగభరిత రాజకీయాలదే పైచేయి అవుతుంది. ఇదే ఈ ఉప ఎన్నికలలో జయాపజయాలకు కారణంగా కనిపిస్తున్నది. ★

# మయన్మార్ ఉప ఎన్నికలో సూకీ విజయం



**యాంగూన్ :** మయన్మార్, పార్లమెంటులో తొలిసారిగా అడుగుపెట్టి ప్రజా సమస్యలపై పోరాడే అవకాశం సూకీ పార్టీకి దక్కింది. 45 పార్లమెంటు స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. ఇందులో 43 స్థానాలను ఆ పార్టీ కైవసం చేసుకుంది. గ్రామీణ ప్రాంత నియోజకవర్గం అయిన కాహ్మూ నుంచి బరిలో నిలిచిన 66 ఏళ్ల సూకీ విజయం సాధించినట్లు ఆమెకు చెందిన నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ (ఎన్ఎల్‌డీ) పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. 99 శాతం ఓట్లు ఆమె ఖాతాలో చేరాయని, విజయం ఖరారైనట్లేనని వెల్లడించాయి. ప్రాథమిక ఫలితాలు తెలుసుకున్న సూకీ మద్దతుదారులు యాంగూన్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సంబరాలు జరుపుకున్నారు. నృత్యాలు చేస్తూ, విజయ సంకేతాలు చూపుతూ ఆనందోత్సాహాల్లో మునిగితేలారు. వారం రోజుల్లో కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా ఫలితాలు వెల్లడించనున్నట్లు భావిస్తున్నారు.

### అక్రమాలపై ఫిర్యాదు ...

దేశవ్యాప్తంగా అనేక పోలింగ్ కేంద్రాల్లో బ్యాలెట్ పేపర్లకు సంబంధించి అక్రమాలు చోటు చేసుకున్నట్లు ప్రతిపక్ష ఎన్ఎల్‌డీ ఆరోపించింది. ఈ విషయంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు పార్టీ అధికార ప్రతినిధి న్యాన్ విన్ తెలిపారు. 2010లో పార్లమెంటుకు జరిగిన సాధారణ ఎన్నికల్లో విజయం సాధించిన వారిలో మాజీ జుంటా ప్రభుత్వ మద్దతుదారులే అధికంగా ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పార్లమెంటులో జనవాణిని గట్టి వినిపించేందుకే సూకీ తాజా ఎన్నికల్లో పోటీ చేశారు. 22 ఏళ్ల పాటు 2010 వరకు ఆమె గృహనిర్బంధంలో ఉన్న సంగతి తెలిసిందే. మరోవైపు ఎన్నికలు పారదర్శకంగా జరిగితేనే సహాయం కింద నిధులు ఇస్తామని ఐరోపా యూనియన్ (ఈయూ), అమెరికాలు గతంలో స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో తాజా ఎన్నికలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ★

**నాగర్ కర్నూలు**

మొత్తం ఓట్లు 1,91,484

పోలైన ఓట్లు 1,40, 554

| పార్టీ | ఓట్లు | శాతం |
|---|---|---|
| నాగం (స్వతంత్ర) | 71,001 | 50.51 |
| కాంగ్రెస్ | 43,676 | 31.07 |
| తెదేపా | 18,608 | 13.23 |
| మిగిలిన 8 మంది అభ్యర్థులకు | 7,183 | 5.11 |

★ తెదేపాకు ధరావతు దక్కలేదు

**మహబూబ్‌నగర్**

మొత్తం ఓట్లు 1,88,225

పోలైన ఓట్లు 1,25,002

| పార్టీ | ఓట్లు | శాతం |
|---|---|---|
| భాజపా | 39,385 | 31.50 |
| తెరాస | 37,506 | 30.00 |
| కాంగ్రెస్ | 25,333 | 20.26 |
| తెదేపా | 17,518 | 14.01 |
| లోక్‌సత్తా | 455 | 0.36 |
| బరిలో వున్న మరో 8 మందికి | 4,788 | 3.83 |

★ తెదేపాకు ధరావతు దక్కలేదు

# అమాయకత్వం నుంచి ప్రజలు బైటపడతారు

## కుళ్లిన రాజకీయం చస్తుంది - నిజమైన రాజకీయం బతుకుతుంది"

***జన జీవితాల చుట్టూ తిరిగే కొత్త రాజకీయానికి భారతదేశంలోనే ఏకైక చిరునామాగా ఉన్న లోక్‌సత్తా పార్టీ తన ప్రస్థానంలో ఎదుర్కొంటున్న తాజా సవాళ్లని, వాటిని అధిగమించేందుకు పార్టీ కార్యాచరణని, వివిధాంశాలపై స్పందనని 2012, మార్చిలో 'ఐ న్యూస్' టీవీ ఛానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ వివరించారు. జేపీతో సీనియర్ జర్నలిస్ట్ కందుల రమేష్ చేసిన ఆ ఇంటర్వ్యూ లోక్‌సత్తా టైమ్స్ పాఠకుల కోసం...***




**డా॥ జయప్రకాష్‌తో ఐన్యూస్ ఇంటర్వ్యూ**

**ఐన్యూస్ :** సాంప్రదాయ రాజకీయ పార్టీలకు భిన్నంగా కొత్త రాజకీయాన్ని అందిస్తామనే హామీతో వచ్చిన లోక్‌సత్తా పార్టీ ఇంకా అనుకున్నంతగా ప్రజలలోకి ఎందుకు వెళ్లలేక పోయింది? బహుశా చాలామందిని వేధిస్తున్న ప్రశ్న ఇది.

**జేపీ:** మఖలో పుట్టి పుబ్బలో పోయే పార్టీలైతే అకస్మాత్తుగా వచ్చేసి కేవలం అధికారం పొందాలనే ఆరాటంతో డబ్బులో, బ్రాందీయో పంచటమో లేకపోతే కులం, మతం, ప్రాంతం పేరుతో ప్రజల్ని చీల్చటమో, లేకపోతే ఆ తాయిలాలిస్తాం, ఈ తాయిలాలిస్తాం అని ఒకళ్లను మించి ఒకళ్లు ఆకర్షణల్ని, భ్రమల్ని చూపుతూంటాయి. వాటితో అవి కొంతకాలం ప్రభావాన్ని చూపవచ్చు. అయితే అవి ఎల్లకాలం నిలవవు. కానీ లోక్‌సత్తా పార్టీ కొత్త భావజాలంతో– అసలీ సమాజాన్నే మార్చాలి, ఈ సమాజాన్ని ప్రజాస్వామీకరించి, అధికారం నడిచే తీరును మార్చాలి, కాబట్టి అధికారం వల్ల వచ్చే ఫలితాలను మార్చాలి అని పోరాడుతోంది. ఇదేకదా మనం కోరుకుంటున్నది.

**ఐన్యూస్ :** కానీ మన రాజకీయాలలోగానీ, సమాజంలోగానీ వ్యక్తులకి, వాళ్ల ఇమేజ్‌కే ఎక్కువ ప్రాధాన్యం కనిపిస్తోంది. వ్యవస్థ తీరు మారాలంటే బహుశా అర్థం కావటం లేదేమో?

**జేపీ:** ప్రపంచంలో మొట్టమొదటిసారిగా ప్రజాస్వామ్యాన్ని మనం ఎలాంటి వ్యవస్థ మీద పెట్టామో ఇక్కడ గుర్తించాలి. నాలుగు విచిత్ర లక్షణాలున్న సమాజం మీద పెట్టాం: 1. విపరీత నిరక్షరాస్యత. అసలీ పౌరసత్వం అంటే ఏమిటో తెలియనటువంటి, అక్షరజ్ఞానం లేనటువంటి, ఆ గుర్తు తప్ప ఇంకోటి చూడనటువంటి, అసలు ఎవడికి ఓటు వేస్తున్నామో తెలియకుండా ఆ సింబల్ మీద గుద్ది పారేయటం ఇక్కడున్న పరిస్థితి. భారతదేశంలో అవసరమే అది. సింబల్ లేకుండా మనదేశంలో ఎన్నికల్ని ఊహించలేం. అక్షరజ్ఞానం లేమికి అది చిహ్నం. అక్షరజ్ఞానం లేమికే కాకుండా, అసలు పౌరసత్వం గురించి అవగాహనలేమికి కూడా అది చిహ్నం. 2వ సమస్య ఏమిటంటే, ఈ దేశంలోని దుర్భర దారిద్ర్యం. 3. అధికారాన్ని ఎక్కడో మనకు అందనంత దూరంలో కేంద్రీకృతం చేయటం 4. దాని పర్యవసానంగా ఏ చిన్నపనికావాలన్నా మన దుంప తెగుతోంది. చాలా మామూలు పనులే అయినా, బర్త్ సర్టిఫికెట్, రెసిడెన్షియల్ సర్టిఫికెట్ వంటి వాటి కోసం కూడా ఎవడోకడి అండలేకపోతే మనకు పనిజరగదు అనే వ్యవస్థను మనం తయారు చేసుకున్నాం. ఈ నాలుగూ ఉంచి దాని మీద ప్రజాస్వామ్యం అనే కప్పును పెడితే, వయోజన ఓటుహక్కును పెడితే, భారతదేశంలోనే కాదు ఏ దేశంలోనైనా ఇప్పుడేం జరిగిందో అదే జరుగుతుంది. మనం అది మనం

మర్చిపోతున్నాం. ఈ మొట్టమొదటి లక్షణాల్ని (ఇనీషియల్ కండిషన్స్‌ని) మార్చేందుకు దేశంలో ప్రయత్నం చేయకపోతే... ఏదో ఎన్నికలు జరుగుతాయి, ఏదో ప్రభుత్వాలు మారుతుంటాయి, ఏదో కొంత స్వేచ్ఛ ఉంటుంది, నిన్నటికన్నా ఇవాళ కొంత బాగుపడుతుంది తప్ప మౌలికంగా ప్రజాస్వామ్యం బాగుపడటం కష్టం.

పైన చెప్పిన నాలుగు సమస్యలనూ మనదేశం వాటిని అధిగమించాలంటే, కొత్త తరం పుంజుకోవాలి. కొత్త రాజకీయాన్ని, దాని ఫలితాల్ని రుచిచూడాలి. ఆ రెండూ ఈవేళ దేశంలో కొంతవేరకు, ఆంధ్రప్రదేశ్‌లో పెద్దఎత్తున జరుగుతున్నాయి. కాలేజీలకు పోయే కుర్రకారులో నూటికి 90మందిని 'మీరు ఎవరి పక్కన' అని అడిగితే లోక్‌సత్తా పక్కన అంటారు. ఖచ్చితంగా యువతరం నుంచి బ్రహ్మాండమైన స్పందన వస్తోంది. రెండోది, మొట్టమొదటిసారిగా ఒక ఆలోచన ప్రారంభమైంది. కేవలం భావాలు కాదు, ఆచరణలో లోక్‌సత్తా వాళ్లు చేసి చూపుతున్నారు. చెప్పినదానికి నిలబడుతున్నారు. ప్రతి సమస్యకి పరిష్కారాన్ని, ఒక చక్కటి ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపెడుతున్నారు. ఎక్కడ వీలుంటే అక్కడ ఆచరించి కూడా చూపుతున్నారు అనేది కూడా క్రమంగా ప్రజలలోకి వెళ్తోంది. కానీ పెద్దసమస్య ఎక్కడొస్తోంది అంటే, సామాన్యప్రజలు ఓటు వేసేటప్పుడు, ఎలక్షన్ తర్వాత ఈ మనిషి నాకు అండగా వుంటాడు అనే నమ్మకం వారికి కలగాలి. ఎందుకంటే, ఆ అండ లేకపోతే పనిజరగని పరిస్థితి ఎప్పుడైతే ఉందో, సామాన్యప్రజలు, కాస్తో కూస్తో చదువుకున్నవారు కూడా వివశులైపోతున్నారు, ధైర్యం కోల్పోతున్నారు. కోట్లు ఖర్చు పెట్టే శక్తి కాదు కావలసింది, వీడు గట్టివాడు, నిలబడతాడు, మాకు అండగా ఉంటాడు అనే నమ్మకం కలగాలి. కానీ నిజాయతీగల రాజకీయానికి అది చాలా కష్టమవుతోంది. ఇవాళేమవుతోందీ– మిగతావన్నీ వదిలిపెట్టేసి ఒక వ్యాపారంలాగా రాజకీయానికి కాలాన్ని కేటాయించి, జనానికి కొంతైనా అందుబాటులో ఉండి, పెద్దపని చేయకపోయినా కాస్తేదో ఉన్నామన్న భావన కలగజేసి, తర్వాత ఓట్లు కొని ఏదో చేస్తున్నారు. ఆ తర్వాత దానికి ప్రతిఫలంగా కోట్లు సంపాదించుకుంటున్నారు, భూములు కబ్జా చేస్తున్నారు, కాంట్రాక్టులు పొందుతున్నారు, ప్రభుత్వాస్తులను సొంత ఆస్తులుగా చేసుకుంటున్నారు–మైనింగో, మరొకటో. అన్నీ అదొక సామ్రాజ్యంలాగా మార్చుకుంటున్నారు. దానికి ప్రత్యామ్నాయంగా నిజాయతీగల రాజకీయం కావాలంటే, ఆ సామర్థ్యం, నిజాయతీ ఉన్నవారు దానికింకా వెరుస్తున్నారు.


డా॥ జయప్రకాష్‌తో ఐన్యూస్ ఇంటర్వ్యూ

**ఐన్యూస్ :** ఎన్నికలలో గెలుస్తాయని మనలో చాలామంది అనుకుంటున్న పార్టీలలో చాలా అంశాల మీద విధానపరమైన అవగాహన కనిపించదు. మన రాష్ట్రంలోని, ప్రభుత్వంలోని చాలా సమస్యల మీద వాటి ప్రకటనలను కూడా మనం చూడం. కేవలం ఒకటో, రెండో అంశాల మీద అవి మొత్తం పునాదుల్ని ఏర్పరుకుని పనిచేస్తుంటాయి.

**జేపీ :** అంటే, రాచరిక రాజకీయాన్ని నడుపుతున్నాయి. మనం కొంచెం పచ్చిగా మాట్లాడుకోవాలంటే– మేం రాజులం, మీరంతా భృత్యులు అన్నట్టు.

**ఐన్యూస్ :** అదెందుకు నడుస్తోందీ అని?

**జేపీ :** మళ్లీ రెండు కారణాలు ఇందులో కనిపిస్తాయి. ఒకటి– పేదరికం, రెండు– ఈ ప్రభుత్వాల వల్ల మాకేదీ జరగదు, ఏది జరగాలో అది జరగదు అని నిర్ణయించేసుకోవటం. అసలిది ప్రభుత్వాల బాధ్యత అనుకోవటంలా. లోక్‌సత్తా ప్రతిరోజూ ఏమంటోంది– మంచి చదువు పొందటం మన హక్కు. ఏ కులంలో, ఏ కుటుంబంలో పుట్టినా కూడా. శాంతిభద్రతల పరిరక్షణ, మనందరికీ రక్షణ, చట్టబద్ధపాలనతోపాటు ప్రభుత్వం చేయాల్సిన మొట్టమొదట పని మనందరికీ మంచి చదువును ఇచ్చి ఏ కులంలో, ఏ కుటుంబంలో పుట్టినా ఎదిగే అవకాశాలు ఇవ్వటం. కానీ లోక్‌సత్తా చెబుతోందిగానీ, కొంతమంది అనుకుంటున్నారుగానీ ఇదంతా ప్రభుత్వం బాధ్యత అని మనమంతా మర్చిపోయాం. అంతేతప్ప ప్రభుత్వం ఎందుకు చేయదు, చేయకపోతే అంతకంటే దుర్మార్గం లేదు, దీన్నుంచి బైటపడటం అనుకోవటం లేదు. కాబట్టి ప్రభుత్వం ఏది చేయాలో అది చేయటం మానేసింది. అది చేయటం మానేసినప్పుడు తాత్కాలికంగా ఏదో చేస్తామని ఒక ఆశ చూపెట్టాలి. ప్రభుత్వం ఏం చేయాలో ప్రజలకి అవగాహన లేకపోవటం, దాని మీద నమ్మకం లేకపోవటం చేత ఇక స్పష్టంగా వాళ్లకి కనిపించేది– నాకు రూ.1కి బియ్యం, ఫ్రీగా కరెంటు, లేకపోతే వృద్ధాప్య పెన్షన్ ఇస్తారు లాంటివే తప్ప నా పేదరికం

తొలగుతుంది, నాపిల్లలు తలెత్తుకుని బతుకుతారు, నేను కష్టపడ్డా కూడా నా పిల్లల జీవితం బాగుంటుంది అనేవి కావు. మీరు మాకేమన్నా ఇస్తే మేం అదృష్టవంతులం, ఒక వందలో రూ. 50తిన్నా, మిగతా రూ. 50 మాకు పంచిపెడితే ఆ మాత్రమన్నా పంచిపెట్టాడు కదయ్యా అనుకుంటుంటారు.

**ఐన్యూస్ :** లోక్‌సత్తా పార్టీకి 2009 ఎన్నికలలో కొంత కొత్త అవకాశాలు వస్తాయి అని చాలామంది ఊహించారు, ఆశించారు కూడా. కానీ ఎప్పటికప్పుడు కొత్త పార్టీలు రావటం జరుగుతోంది. ఇప్పటికీ...

**జేపీ :** (నవ్వుతూ) అంటే ఇలాంటివి వస్తూపోతుంటాయి. మహాత్మాగాంధీ ఎన్నో సార్లు చెప్పారు– 'ఎ రిఫార్మర్ మస్ట్ హ్యావ్ ఇనార్మస్ పేషెన్స్'. నిజంగా వ్యవస్థలో మౌలికమైన మార్పు తేవాలనుకునేవారికి అపారమైన ఓర్పు కావాలి. నాకు ఆరునెలలలో మార్పు రాకపోతే నేను వెళ్లిపోతాను అనే వారికి దేశం గురించి పోరాడే హక్కు లేదు. గాంధీగారు జీవితంలో ఎంతకాలం పోరాడారు? ఇవాళ్టి కాలంలో అంతకాలం పోరాడాల్సిన అవసరం లేకపోవచ్చు. ఇంకా కొంత వేగంగా చేయవచ్చు. ఆర్థికంగా, సాంకేతికపరంగా మార్పులు వస్తున్నాయి కాబట్టి. కానీ టెక్నాలజీలో మార్పులు వచ్చినంత వేగంగా సమాజంలో మార్పు రాదు. అందుకని అధికార క్రీడలో మాకు తాత్కాలికంగా ఒడిదుడుకులున్నాయన్న కారణంగా మనం ధర్మాన్ని, సత్యాన్ని వదిలేస్తే, నిజం అన్నదాన్ని వదిలేస్తే దేశం నాశనమైపోతుంది. కాబట్టి ఇవన్నీ గతించిపోతున్న రాజకీయానికి చిహ్నాలు.



డా॥ జయప్రకాష్ తో ఐన్యూస్ ఇంటర్వ్యూ

**ఐన్యూస్ :** కానీ ఆ సందేశం ఎందుకని జనంలోకి వెళ్లటం లేదనుకుంటున్నారు?

**జేపీ:** వెళ్తుంది, వెళ్తుంది. వెళ్లకపోవటం కాదు. కానీ సందేశం వెళ్లటానికి, ఆ వెళ్లింది పూర్తిగా ఒంటపట్టించుకోవటానికి, ఒంటపట్టినతర్వాత దానికి రాజకీయంగా అడుగులు వేయటానికి మధ్య అంతరం ఉంటుంది ఎప్పుడూ కూడా. ఆ అంతరానికి కాలమనేది ఒక లెవర్. ఉదాహరణకి, ఓటు వేసేవాడి కోసమే ఎన్నికలు అన్నది చాలా సులువైనది అర్థమైతే. కానీ అర్థం కాకపోతే, అయ్యో, మనమేంటి? మనకోసం ఎన్నికలేంటి? ఆళ్లు గదా మారాజులు. ఆడు ఐదు కోట్లు ఖర్చు పెడుతున్నాడు, ఈడు ఐదు కోట్లు పెడుతున్నాడు, ఆడు పెద్దకులం వాడు, ఈడు పెద్దమతం వాడు, వాళ్లు నాయకుల కుటుంబాల నుంచి వచ్చారు, ఇంత పెద్ద ఆడంబరం ఉంది, వంద కార్లలో వస్తున్నాడు, మనమంతా ఎక్కడ, మనం బిచ్చగాళ్లలా నుంచునుంటాం, మనకు ఆళ్లతో పోలికేంటి?... ఇది గదా మన మనస్తత్వం. దీన్నుంచి బైటపడితే జనం కోసం ఎన్నికలు అన్నటువంటిది చాలా సులభమైన ఆలోచన. ఆ ఆలోచన మనసులోకి ఇంకి అది అర్థం కావటానికి కొంతకాలం పడుతుంది. లోక్‌సత్తా ప్రారంభించినప్పుడు లోక్‌సత్తా వాడిన భాష మొత్తం దేశంలోనే చాలా కొత్త భాష. ఈవేళ నేను గర్వంగా చెప్పేదేమిటంటే– దేశంలో దాదాపు అన్ని రాజకీయపార్టీలు, మీడియా, కొన్ని సందర్భాలలో సినిమాలు ఇదే భాషను వాడుతున్నాయి. చిరంజీవిగారు వచ్చారు. పాపం, ఉద్దేశం ఏదైనా అదే మూసలో ఆడారు. ఎక్కువకాలం నిలబడలేకపోయింది ఆయన పార్టీ. దేవేందర్ గౌడ్‌గారు ఒక పార్టీ పెట్టారు, జ్ఞానేశ్వర్‌గారు ఇంకో పార్టీ పెట్టారు, ఇంకొకళ్లు ఇంకొకటి పెట్టారు, కాలగర్భంలో కలిసిపోయాయి. ఇప్పుడు జగన్ పార్టీ వచ్చింది. సరే, కొంతకాలం డెఫినెట్‌గా ఏదో తండ్రి ప్రజలకేదో చేశాడనే భావంతోగానీ, ఇంతకంటే పెద్దజరగదనో భావంతోగానీ, కోట్లు తిన్నా కూడా మాకు కొంత ఇస్తున్నాడన్న భావంతోగానీ, కులాలు, వర్గాలు వగైరాల కారణంగా ఆ సాంప్రదాయపార్టీ చుట్టూ తిరగవచ్చు.

**ఐన్యూస్:** అంటే మీరు చెబుతున్నట్టు ఇవన్నీ పనిచేస్తున్నాయనేది కనిపిస్తోంది గదా?

**జేపీ:** దాన్లో అనుమానం లేదు. కానీ మనం ప్రజల మీద, చరిత్ర మీద విశ్వాసం ఉంచాలి. సమాజంలో పరిణతి అంటే అర్థం అదే.

**ఐన్యూస్:** కానీ ఒక రకమైన సోషలిస్టు భావనను, ఎవరో అన్నీ చేసి అమర్చిపెడతారు అనే భావనను పార్టీలు ప్రజలలోకి తీసుకెళ్తున్నాయి. నిజంగా చేసినా, చేయకపోయినా అలాంటి మాటలు చెప్పటం, అలా నటించటం వల్లే ఈవేళ పార్టీలు మనగలుగుతాయి, అలా చేయకుండా వేరేవిధంగా ఏం మాట్లాడినా ప్రజలకు అర్థం కాదనేది చాలామంది భావన.

**జేపీ:** 1970ల భావజాలంలో మా అమ్మ ఇచ్చింది, మా అయ్య

ఇచ్చాడు అనే భావన నుంచి వచ్చిన తరంలో ఆ తీరు కనిపిస్తుందిగానీ, ఈవేళ్టి యువతరంలో కనిపించదు. నేటి యువతనే చూడండి. వారిలో చాలా కసి ఉంది. ఎవరో మాకు ఇచ్చేదేంటి, మేం పెరుగుతాం, మేం ధైర్యంగా మాకది కావాలి అని సాధించుకుంటాం అని చెబుతుంటారు. రాజకీయంలో గతిస్తున్న తరానికి, యువతరానికి మధ్య చాలా పెద్ద అంతరం ఉంది. ఈ యువతరం పెరిగి ఈ ఆలోచన మరింత ప్రౌఢమైనప్పుడు అప్పుడు దేశంలో మార్పు వస్తుంది. ఒకరకంగా లోక్‌సత్తా ఈ కొత్తతరానికి ప్రతినిధిగా వస్తోంది. వారికో వేదికగా వస్తోంది. ఖచ్చితంగా వ్యవస్థ మారుతుంది. దాన్లో అనుమానం లేదు.

**ఐన్యూస్:** చాలామంది లోక్‌సత్తా గురించి మాట్లాడుతూ... అదో మధ్యతరగతికి ప్రాతినిధ్యం వహిస్తూ, మధ్యతరగతి ఆలోచనలకు ప్రతిబింబంగా ఉన్న పార్టీ అంటుంటారు. ప్రతి దానిలో నాణ్యత ఉండాలని, అవసరమైతే కొంత డబ్బు చెల్లించటానికైనా సిద్ధమని చెబుతుండే మధ్యతరగతి ప్రజల భావాలకు తగ్గట్టు లోక్‌సత్తా పనిచేస్తుందంటుంటారు.



డా॥ జయప్రకాష్ తో ఐన్యూస్ ఇంటర్వ్యూ

**జేపీ:** గత 50–60 ఏళ్లుగా పేదలను గురించి ఆలోచించే పార్టీలు వచ్చాయి గదా, మరి పేదరికం ఎందుకని తగ్గలేదు? ఎందుకని ప్రభుత్వం 72శాతం మందికి– 90శాతం గ్రామాలలో, 50 శాతం పట్టణాలలో ఉన్నవారికి మేం తిండి ఉచితంగా పెట్టకపోతే తిండి తినే పరిస్థితి లేదని అంటోంది? పేదరికం గురించి పట్టించుకున్న పార్టీలు ఎందుకని 72శాతం భారత జనాభాకి మేం భోజనం పెట్టకపోతే బతకలేరనే పరిస్థితి వచ్చింది? అంటే పేదరికాన్ని కొనసాగిస్తున్నది, పేదరికాన్ని పెంచి పోషిస్తున్నది పేదరికాన్ని గురించి మాట్లాడుతున్న పార్టీలా లేకపోతే పేదరికం ఎలా పోవాలో దాని కోసం పోరాడే లోక్‌సత్తా లాంటి ఉద్యమం, పార్టీయా? ప్రపంచంలో ఏ దేశంలోనైనా మంచి విద్య,ఆరోగ్యం అందకుండా, నైపుణ్యం లేకుండా, సంపాదించే శక్తి లేకుండా పేదరికం పోయిందని ఒక్క దేశాన్ని నాకు చూపెట్టండి. ఒక్క దేశాన్ని చూపెట్టండి. అసాధ్యం. కాబట్టి అసలు పేదల కోసం పోరాడేటటువంటి పార్టీయే లోక్‌సత్తా.

**ఐన్యూస్:** సరే, ఆ అంశాలు జనంలోకి వెళ్లటానికి కొంత టైం పడుతుందంటున్నారు. వాటితోపాటుగా ఇమేజ్ అనేది ఒకటి ఇవ్వాళ చాలా ఇంపార్టెంట్‌గా మారిపోయింది. అది ఒక సెంటిమెంట్ అనండి, కులమో, మతమో, ప్రాంతమో అనే ఒక భావనతో మనవాడు అని అనుకోవటం కానివ్వండి, ఇవి ఎక్కువ పాత్ర పోషిస్తున్నాయి గదా?

**జేపీ:** చేస్తున్నాయి. కాదనటం లేదు. కానీ ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకుని అధికారం కోసం మనం కూడా దిగజారాలా లేక ప్రజలకున్నట్టువంటి ఔన్నత్యాన్ని, ఆలోచనని పెంచి, ప్రజల ఎత్తును పెంచి మనం వ్యవస్థని ఇంకా ఉన్నతస్థాయికి తీసుకెళ్లాలా? అదొక నిర్ణయం చేసుకోవాలి మనం. దేశం ఏమైపోయినా నాకు పర్లేదండీ, నేను అధికారం పొందటమే లక్ష్యం అని చెప్పి అంటే 2,000 ఏళ్ల క్రితం కూడా అధికారం కోసం పోరాటం ఉంది. ఆనాడు కత్తితో చేసేవాళ్లు, తలకాయలు నరికేవాళ్లు. ఈవేళ అధికారం కోసం పోరాటం డబ్బుతో చేస్తున్నారు, మనుషుల జీవితాల్ని నరికేస్తున్నారు. దానికి, దీనికి ఆట్టే తేడా లేదు. కాకపోతే ఆ చిహ్నాలు మారినాయి అంతే. అదే అధికారం అలా కాకుండా మేలైన ప్రజాస్వామ్య భావనతో, సమాజంలో ఒక మానవ విలువలతో, ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశం కావాలి, ఆత్మగౌరవం కావాలి, నిజంగా ప్రజలు ప్రభువులు కావాలి, ఎన్నికైనవాడు ప్రజల ప్రతినిధి మాత్రమే అనే రాజకీయంతో సాధించాలి. ఈ మౌలికమైన మార్పును మనం కోరుకుంటున్నామా, లేదా? ఏం కోరుకుంటున్నాం మనం? అధికారమే కోరుకున్నట్టయితే లోక్‌సత్తా పద్ధతి సరైంది కాదు ఈవేళ. కానీ దేశంలో మౌలికమైన మార్పు కావాలంటే లోక్‌సత్తా పద్ధతి తప్ప వేరే పద్ధతే లేదు.

**ఐన్యూస్:** (నవ్వుతూ) మార్పు ఈ మధ్యకాలంలో జయప్రకాష్ నారాయణ్ గారిలో గమనించాం. రైతు సత్యాగ్రహ యాత్ర పేరుతో మీరు గ్రౌండ్ లెవెల్‌కి వెళ్లటం, అక్కడ రైతులతో కలిసి ధాన్యాన్ని రాష్ట్ర సరిహద్దు దాటించి అమ్మటం... ఇలాంటివి ఇంతకు ముందు ఎప్పుడూ చేయలేదు. ఇది కావాలని చేశారా? ఇటువంటి పద్ధతి ఎంచుకుంటేనే మనం ప్రజలలోకి వెళ్లగలమనే నిర్ణయానికి వచ్చారా?

**జేపీ:** ఒక రాజకీయ పార్టీ అన్న తర్వాత భావ సంఘర్షణ ఉంటుంది. ఉదాహరణకి, ఈవేళ ఏమంటున్నారు– అబ్బెబ్బె, వ్యవసాయోత్పత్తుల్ని కంట్రోల్ చేస్తేనే అందరికీ న్యాయం

జరుగుతుంది అని. కంట్రోల్ చేస్తే అన్యాయం జరుగుతుంది, స్వేచ్ఛ ఉంటేనే న్యాయం జరుగుతుంది అనేది మా మౌలికమైన వాదన. ప్రభుత్వమే ఇక్కడ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నది. అదే ఇప్పుడు లోక్‌సత్తా ఈపని చేయలేదనుకోండి, ప్రభుత్వమే చట్టాన్ని ఉల్లంఘించిందన్న మాట బైటికొచ్చేదా? ఇప్పటిదాకా ఏమనుకుంటున్నారు– ఆడు ప్రభుత్వం కాబట్టి, పూర్వకాలంలో రాజు ఎలాగో అలా అని. రాజుగారు ఏంటి– ఎవరో ఒకాయన భార్య నచ్చితే ఆయన భార్య తన భార్య అనేవాడు రాజు. అంతే. రాజు అన్నాడు కాబట్టి ఇక అదే చట్టం. అవతలోడికి హక్కుల్లేవు, పాడూ లేవు. అదీ ఆనాటి రాజ్యం. ఈవేళ అట్లా కాదు. ఒక రాజ్యాంగం ఉంది, చట్టం ఉంది, చట్టప్రకారం ప్రభుత్వం నిర్ణయాలు చేయాలి. మన ప్రభుత్వం ఏం చేసిందీ?– రాజ్యాంగం, చట్టం ఒక మాట చెబుతుంటే దానికి అతీతంగా ఈ ప్రభుత్వం ఆంక్షలు పెట్టేసింది. ఈ ప్రభుత్వానికి ఆ హక్కులేదన్న మాట జనానికి తెలియదు. ఎందుకంటే ఇంకా రాచరికంలోనే జనం బతుకుతున్నారు. లోక్‌సత్తా ఈ విషయాన్ని బైటికితెచ్చి దాని కారణంగా అసెంబ్లీలో చర్చ అయినప్పుడు అప్పుడు మంత్రిగారు, ముఖ్యమంత్రి గారు ఆ,ఊ, మెమ్మె, పెప్పె, కరెక్టే మాకా అధికారం లేదు, మేం ఇన్‌ఫార్మల్‌గా నిబంధనలు అమలు చేస్తున్నాం, చట్టప్రకారం జేపీ చేసినదాంట్లో తప్పులేదు, అందుకే అరెస్టు చేయలేదు, ఆయన ఆంక్షలను ఉల్లంఘించలేదు, మేమే ఉల్లంఘించాం అని చెప్పాల్సి వచ్చింది కదా. ఇది బైటపెట్టాలంటే ఎలా జరుగుతుంది? ఇది చాలా సింపుల్ పాయింటే. కానీ కోట్ల మందికి చేరాలంటే, జేపీ లాగా చట్టానికి, రాజ్యాంగానికి అంత గౌరవం ఇచ్చే వ్యక్తి కూడా ఎందుకని ఆంక్షలని ఉల్లంఘించి జైలుకెళ్తానని చెబుతున్నాడు అనే చర్చ జనంలో కలగాలి. ఆ అంశం అలాంటిది. ఆ అంశం కేవలం ఏదో ఒక బియ్యం మీదో, ధాన్యం మీదో ఆంక్షలకి పరిమితమైంది కాదు. వ్యవసాయరంగానికి ఎంత అన్యాయం జరుగుతోంది, వ్యవసాయంలో ఉన్న జనాభా పెరుగుతుంటే, వారికి వచ్చే ఆదాయం తగ్గుతోంది, మిగతావాళ్లతో పోలిస్తే వ్యవసాయంలోని వారి ఆదాయం పదవ వంతు వున్నది, అయినా వాళ్లను కుళ్లబడిచి మిగతావాళ్లను రక్షించాలని డ్రామా లాడుతున్నారు, మిగతావాళ్లను రక్షించటం కాదు, కేవలం అవినీతికే ఆ ఆంక్షలు ఉపయోగపడుతున్నాయి అనే వాస్తవాలను కళ్లకు కట్టి మౌలికసంస్కరణలను సాధించే లక్ష్యంతో చేసింది. ఇవాళ ధాన్యం ఆగటంలా ఎక్కడా. కానీ ఈ పర్మిట్ల పేరుతో లంచాలు బొక్కుతున్నారు. ధాన్యం అమ్మటానికి ఒక లంచం, ఎంఎస్‌పి సర్టిఫికెట్‌కి ఇంకో లంచం. కాగితాల మీద బాగానే ఉంటుంది. కానీ దానికీ లంచం వల్ల జరిగే ఫలితం దోపిడీయే. ఇది ప్రజలకు అర్థం కావాలంటే కొన్ని పద్ధతులు కావాలి.

**ఐన్యూస్:** రైతు సత్యాగ్రహ యాత్ర వంటి పద్ధతులు ముమ్ముందు ఇంకా చేపడతారా?

**జేపీ :** అంటే సందర్భాన్ని బట్టి. పిడుగుకి, బియ్యానికి ఒకే మంత్రం వేయకూడదు. ఆ విషయం తీవ్రతను బట్టి, సందర్భాన్ని బట్టి, దానివల్ల సమాజానికి వచ్చే ఫలితాన్ని బట్టి ఖచ్చితంగా పద్ధతుల్ని ఎంచుకుంటాం. గత రెండేళ్లలో లోక్‌సత్తా చేసిన కార్యక్రమాల వల్ల రాష్ట్రంలోనేకాదు, దేశంలోనే వ్యవసాయంలో కొన్ని కీలక మార్పులు మొదలయ్యాయి, పార్టీ నిరంతర కృషి వల్ల రాజకీయం రీతి కూడా చురుగ్గా మారుతోంది.



డా॥ జయప్రకాష్‌తో ఐన్యూస్ ఇంటర్వ్యూ

**ఐన్యూస్ :** ఈసారి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలనుగానీ, అంతకుముందు సమావేశాలనుగానీ చూస్తే మీరు చేస్తున్న పాజిటివ్ రాజకీయాల వల్ల మార్పు వస్తుందన్న నమ్మకం కలుగుతోందా?

**జేపీ :** రెండు విషయాల్ని గమనించాలి. 1) ఇదికాకుండా వేరే మార్గమేమన్నా ఉందా? ఎన్నికలు, చట్టసభలు కాకుండా వేరే మార్గం ఉందా? అవి లేకుండా మీరు అద్భుతాల్ని సాధించే మాయా దీపం ఉందా? 2) ఈ మార్గంలో పోరాటం చేస్తుంటే ఖచ్చితంగా కొన్ని ఫలితాలు వస్తున్నాయి. కొన్ని సందర్భాలలో కీలకమైన, గొప్ప ఫలితాలు కూడా వస్తున్నాయి. ఉదాహరణకి, ఉపాధి హామీ చట్టంలో అవినీతి కట్టడికి అంబుడ్స్‌మన్ ఏర్పాటు విషయాన్నే తీసుకోండి. ఆ ప్రతిపాదన చేసిందెవరు? ఆ చట్టాన్ని పర్యవేక్షించటానికి శాశ్వత ప్రాతిపదికన స్టాండింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని, జిల్లాకో అంబుడ్స్‌మన్‌ను పెట్టాలని ఎవరు ప్రతిపాదనలు పెట్టారు?– లోక్‌సత్తా. అందరూ అంగీకరించారు

చివరకు ప్రభుత్వం ఒప్పుకుంది. పేరు లోక్‌సత్తాకు రాకపోవచ్చు, సంఖ్యాబలం ఇంకొకరికి ఉంది కాబట్టి రకరకాల పేర్లు రావచ్చు. సభలో రికార్డులు చూస్తే ఆ అంశం మీద ఆ డిమాండ్లతో ఈ బడ్జెట్ సమావేశాలలోగానీ, అంతకుముందుగానీ సభలో ఎవరు వాదించారో తెలుస్తుంది. ఎవరైనా పాత్రికేయులు పరిశోధన చేస్తే... ఎవరి వాదాన్ని అన్ని పార్టీలూ అంగీకరించి ఏకాభిప్రాయం సాధ్యమైందో బైటికొస్తుంది. ఈ కృషంతా లోక్‌సత్తాయే చేసింది.

**ఐన్యూస్ :** ఆరకంగా ఉన్న వ్యవస్థలో కూడా ఎంతో కొంత చేయవచ్చంటారు?

**జేపీ :** ఖచ్చితంగా. కానీ ఇది సరిపోతుందా అంటే చాలదు. దేశంలో మౌలికమార్పులు ఇంకా చాలా వేగంగా కావాలనుకునే వ్యక్తిగా, ఈరోజే అంతా మార్పు వచ్చేయాలని నాకు ఉంటుంది. కానీ టెక్నాలజీ వచ్చినంత వేగంగా, సెల్‌ఫోన్లు, స్విచాన్-స్విచాఫ్‌తో 24 గంటల టీవీ వచ్చినంత వేగంగా దేశంలో, సమాజంలో పరిస్థితులు మారవు. మన భావనలు మారి, అక్కడ్నుంచి మన ప్రవర్తన మారి, అక్కడ్నుంచి దాని ఫలితాలు మారాలి. అంటే 3 అంచెలు ఉన్నాయి. దానికి సమయం పడుతుంది. దానికి ఎంత వేగంగా చేయాలో అంతవేగంగా ప్రయత్నం చేద్దాం.



డా॥ జయప్రకాష్ తో ఐన్యూస్ ఇంటర్వ్యూ

**ఐన్యూస్:** అంత దీర్ఘకాలిక ప్రయాణానికి అవసరమైన సామాగ్రి అంతా లోక్‌సత్తా వద్ద ఉందా, ...

**జేపీ :** ముందు కావలసిన సామాగ్రి- సంకల్పమండీ. తర్వాత సామాగ్రి- మేధస్సు. ఆ తర్వాత సామాగ్రి- సమాజం పట్ల అనురాగం, ప్రేమ ... ఈ మూడూ లోక్‌సత్తాకు పుష్కలంగా ఉన్నాయి ఈ మూడూ ఉంటే మిగతావన్నీ ఒనగూడతాయి. నాకేం అనుమానం లేదు.

**ఐన్యూస్ :** కనీసమైనటువంటి వనరులు లేకుండా ఏ సంస్థయినా నడవటం కష్టం గదా...

**జేపీ:** నిజమే. కానీ కోట్ల రూపాయలతో అక్రమంగా రాజకీయం చేద్దామనుకుంటే అప్పుడు లోక్‌సత్తా... లోక్‌సత్తా కాజాలదు. అందుకే 2003లో, రాజకీయ పార్టీ ఆలోచన కూడా లేనప్పుడు, పార్టీల నిధుల సేకరణకు లోక్‌సత్తా ఒక చట్టాన్ని సాధించింది. ఎందుకని? నిజాయతీ రాజకీయానికి నిజాయతీ డబ్బు కావాలి. అందుకు ఒక మార్గం ఏర్పరచాలని ఒక ప్రామాణిక చట్టం తీసుకురావటం జరిగింది. కానీ భారతదేశంలో దాన్ని అమలు చేస్తున్న ఏకైకపార్టీ లోక్‌సత్తా మాత్రమే. అరుణ్‌జైట్లీ నాతో ఎప్పుడూ అంటుంటారు- "మీరు గట్టిగా పోరాడి కాంగ్రెస్, బీజేపీలను కలిపి జాతీయస్థాయిలో చట్టం చేయించారు, కానీ మేం ఎంత ప్రయత్నించినా దాని అమలులో విఫలమవుతున్నాం. రూ.100లలో కేవలం రూ.5కి మాత్రమే చెక్కు ఇస్తున్నాం. మిగతా రూ.95 బ్లాక్‌లో అవసరమవుతోంది. ఇక మాలాంటివాళ్లు గతిలేక దానికి అలవాటు పడిపోయాం" అని. కానీ లోక్‌సత్తా పార్టీ మాత్రం ఈ విషయంలో ఖచ్చితంగా వ్యవహరిస్తోంది. నేను గుండె మీద చేయివేసుకుని చెప్పగలను. ఈవేళ ఎవరైనా ట్రై చేయండి. రూ.10,000 లోక్‌సత్తాకు విరాళంగా ఇవ్వండి. తక్కున ట్యాక్స్ మినహాయింపు వచ్చేస్తుంది. ఒక నిజాయతీ అయిన రాజకీయానికి మార్గాన్ని ఏర్పరుస్తున్నాం. ప్రజలు తేల్చుకోవాలి. ఒక నిజాయతీ అయిన రాజకీయం ద్వారా దేశం మారుతుందా? లేక రాజకీయంలో డబ్బులు పెట్టుబడి పెట్టి దాన్ని వ్యాపారంగా మార్చటం వల్ల దేశం మారుతుందా?- జనం తేల్చుకోవాలి.

**ఐన్యూస్ :** ప్రైవేటీకరణ గురించి ఏదైనా మాట్లాడేటప్పుడు, లోక్‌సత్తా లాంటి పార్టీలన్నీ కూడా మార్కెట్‌వాదానికి అనుకూలంగా వాదిస్తాయనే భావన ఉంది. ఉదాహరణకి, వ్యవసాయరంగంలో రిటైల్ వ్యాపారంలోకి విదేశీ నిధులు (ఎఫ్‌డీఐ) రావటానికి మీరు అనుకూలంగా మాట్లాడారు. అటువంటివి మాట్లాడినప్పుడల్లా అవి మీకు నెగెటివ్‌గా వెళ్లటానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి గదా?

**జేపీ:** 25 ఏళ్ల క్రితం బ్యాంకులలో కంప్యూటర్లు వస్తాయన్నప్పుడు వామపక్ష పార్టీలన్నీ వాటికి వ్యతిరేకంగా బ్రహ్మాండమైన ఉద్యమాలు చేశాయి, సమ్మెలు చేశాయి. ప్రజలంతా మౌనంగా ఉన్నారు. ఎందుకంటే, ప్రజలకు దానివల్ల లాభాలేమిటో తెలియదు. దానివల్ల నష్టపోతాం, పేదరికం పెరుగుతుంది అనుకున్నారు. ఈవేళ దేశంలోని బ్యాంకులలో

కంప్యూటరీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తామని వామపక్షపార్టీలను చెప్పమనండి. ప్రజలు కాళ్లు విరగ్గొడతారు. ఇటీవల ఎయిర్‌పోర్టుల ప్రైవేటీకరణ జరుగుతుంటే పెద్ద ఉద్యమాలు చేపట్టారు. మూడు రోజులలో తోకముడిచారు. ఎందుకని? మూడురోజులలో వినియోగదారులు పెద్ద గుణపాఠం చెప్పారు. ఎప్పుడైతే ప్రజలకు దాని లాభనష్టాలు అర్థమవుతాయో అప్పుడు మీ పప్పులు ఉడకవు. అర్థం కానంత వరకూ డ్రామాలు నడుస్తాయి. ఆనాడు కంప్యూటరీకరణ గురించి ఎంత బూటకం మాట్లాడారో, ఈవేళ రిటైల్ వ్యాపారం గురించి కూడా అంత అబద్ధాలు మాట్లాడుతూ వ్యతిరేకిస్తున్నారు. రిటైల్ వ్యాపారం అటు వినియోగదారునికి, ఇటు ఉత్పత్తిదారునికి ఇద్దరికీ లాభం. ఉత్పత్తిదారునికి రేటు పెరుగుతుంది, వినియోగదారునికి రేటు తగ్గుతుంది. ఇప్పుడు రూ. 35 ఉత్పత్తిదారునికి వస్తుంటే, వినియోగదారునికి రూ. 100 పడుతోంది. మధ్యలో రూ. 65 ఉంది. ఈ రూ. 65ను తగ్గించి, ఉత్పత్తిదారునికి రూ. 45-50 దక్కేలా, వినియోగదారునికి రూ. 70కి లభించేలా చేయటం అవసరం కాదా? మనం ఎవరికోసం పోరాడుతున్నాం? ఏ పేదలకోసం? ఉత్పత్తి, వినియోగం చేయకుండా మధ్యలో పెట్టుబడి పెట్టి లాభం పొందే వారి గురించి గురించా? ఈ ప్రశ్నను ప్రజలు అడగటంలా. వాళ్లకి తెలియటంలా. కామోసు అనుకుంటున్నారు. సమయం వచ్చినప్పుడు తెలుస్తుంది. అందుకోసం మనం భయంపడిపోయి ఆనాడు కంప్యూటర్లు వస్తే దేశం నాశనమవుతుందన్న వాదనతో గొంతు కలిపితే మనం మూర్ఖులం. ఓట్ల కోసం, ప్రజల్లో అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని భవిష్యత్తును నాశనం చేయటమే అది. ఈవేళ రిటైల్ చైన్లు వస్తే కొంపమునిగిపోతుందనటం కూడా నాడు కంప్యూటర్ల విషయంలో చేసిన బూటకపు వాదనలాంటిదే.



డా॥ జయప్రకాష్‌తో ఐన్యూస్ ఇంటర్వ్యూ

**ఐన్యూస్:** కానీ ప్రజల్లో ఆ రకమైన అవగాహన లేదు...

**జేపీ:** అప్పుడు ఆ అవగాహనను పెంచటం కోసం పోరాడదామా లేకపోతే అవగాహన లేదు కాబట్టి వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటామా? – తేల్చుకోవాలి. రేపటి రాజకీయమా? గత రాజకీయమా?

**ఐన్యూస్:** దానివల్ల ఎంత ఆలస్యమైనాసరే మనం అనుకున్నది సాధించటానికి సిద్ధపడాల్సిందేనంటారా?

**జేపీ:** దానివల్ల దేశంలో మార్పు ఆలస్యమవటంలా– జేపీ పదవులలోకి రావటం ఆలస్యం కావచ్చు. జేపీకి పదవులు రావటం లక్ష్యం కాదు గదా! దేశంలో మార్పు లక్ష్యమైనప్పుడు నా పదవుల కోసమని దేశంలో మార్పుని ఆపేస్తానా?


దేశంలో మార్పు కోసం పదవి వచ్చినా రాకపోయినా అది పెద్దవిషయం కాదు. ఇవాళ తాత్కాలిక ఓటుబ్యాంకు కోసమని దేశభవిష్యత్తుని ఫణంగా పెడుతున్నారు. లోక్‌సత్తా ఎప్పుడో నిర్ణయించుకుంది– పార్టీ కంటే దేశం మిన్న అని. దేశ భద్రత కోసం, దేశ భవిష్యత్తు కోసం పార్టీ ప్రయోజనాలను పక్కన పెడతాం. తాత్కాలికంగా ఓటు ముఖ్యం కాదు. విజ్ఞతతో ప్రజలు ఓటు వేసి దేశాన్ని మార్చే బాధ్యత పెడితే ఖచ్చితంగా శిరసావహిస్తాం. కానీ దానికోసమని ప్రజలను మోసం చేయం. ఖచ్చితంగా ఈ మూర్ఖత్వం నుంచి, అమాయకత్వం నుంచి సమాజం బైటపడుతుంది. ఆ కాంతిపుంజాలు సమాజాన్ని చేరతాయి. ఈ కుళ్లిన రాజకీయం చస్తుంది. నిజమైన రాజకీయం బతుకుతుంది. అసెంబ్లీలో ఎవరి మాటలకు విలువ ఇవ్వాలి, ఎవరిని పట్టించుకోకూడదు జనానికి అర్థమై పోతోంది గదా? ఎంతకాలం మీరు దాచగలరు? ఎన్ని మెగాఫోన్లు పెట్టినా, ఎంత ప్రచారం చేసుకున్నా చివరికి వాస్తవాన్ని ప్రచారం పూర్తిగా కప్పిపెట్టలేదు గదా? ఎందుకని ఈవేళ ఒక 5 నిమిషాలు అసెంబ్లీలో లోక్‌సత్తా మాట్లాడితే భయపడిపోతున్నారు. ఈయనకి 5ని॥ టైం కూడా లేకుండా ఉంటే బాగుండునని ఎందుకనుకుంటున్నారు? అంతభయం ఎందుకొచ్చింది? ఆఫ్ట్రాల్ నాకున్నది 5-10ని॥ టైమేగదా? ఆ టైం కూడా భరించలేకపోతున్నారెందుకని? నిజంగా ప్రజల ముందుకు వస్తే ఆ 10ని॥ ఇక్కడ, గంట అక్కడ మధ్య వ్యత్యాసం ప్రజలకు అర్థమైపోతుంది కాబట్టి. ఎల్లకాలం మీరు నిజాన్ని అబద్ధంగా మార్చలేరు, అబద్ధాన్ని నిజంగా చూపెట్టలేరు.

**ఐన్యూస్:** లోక్‌సత్తా పార్టీ అనుకున్నది సాధించాలని, మార్పు త్వరగా రావాలని కోరుకుంటూ అభినందనలు

**జేపీ:** థాంక్యూ, థాంక్యూ. ★

# విద్యుత్ ఛార్జీల వడ్డన

■ **సామాన్యుల నుంచి పరిశ్రమల వరకు**



గృహ వినియోగ, వాణిజ్య పరిశ్రమలకు ఛార్జీలు పెంచుతూ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) ఆదేశాలు జారీ చేసింది. ఏప్రిల్ 1 నుంచి పెరిగిన ఛార్జీలు అమలులోకి వస్తాయి. పెంచిన ఛార్జీలతో రాష్ట్ర ప్రజలపై రూ. 4,442 కోట్ల భారం పడుతోంది. ఇందులో గృహ వినియోగదారులపైనే రూ. 930 కోట్లకుపైగా ఆర్థికభారం పడుతుంది. దోబీఘాట్లు, పౌల్ట్రీలు, మరమగ్గాలు, కుటీర పరిశ్రమలపైనా ఛార్జీల దెబ్బ పడింది. బిల్లులు సకాలంలో చెల్లించకుంటే అదనపు రుసుం వసూలు చేయడానికి ఈఆర్‌సీ అనుమతి ఇవ్వడంతో... ఇక ఆలస్యం చెల్లింపులపైనా జరిమానా వసూలు చేస్తారు. రీకనెక్షన్, మీటర్ తనిఖీ తదితర సేవలకు ఛార్జీలు పిండుతారు.

**సామాన్యుల జేబులు గుల్ల**

గృహ వినియోగదారులు, వాణిజ్యవర్గాలపై ఛార్జీల పెంపుతో మోయలేని భారం పడబోతోంది. కనెక్టడ్ లోడు 500 వాట్‌లు దాటిన వినియోగదారులకు వచ్చే బిల్లులతో జేబులు గుల్లకానున్నాయి. ఇప్పటి వరకు అన్ని వర్గాలకు మొదటి 50 యూనిట్లకు యూనిట్ రూ. 145... 51 నుంచి 100 యూనిట్ల వరకు యూనిట్‌కి రూ. 2.80 ఉంది. ఇకపై 500 వాట్‌లు లోడు దాటితే మొదటి 100 యూనిట్లకు యూనిట్‌కి రూ. 2.60 చొప్పున ఛార్జీ వడనుంది. వాణిజ్యవర్గాలకూ ఇదే పరస్థితి. ప్రస్తుతం సాధారణ పట్టణాల్లో కూడా సింగిల్ బెడ్‌రూం ఫ్లాట్లలో ఉండేవారి కనెక్టెడ్ లోడు 500 వాట్‌లు దాటుతోంది. అంటే కనెక్టెడ్ లోడు పేరుతో పెంచిన ఛార్జీలు పెద్దభారంగా మారనున్నాయి. గృహ వినియోగదారులకు గరిష్ఠంగా యూనిట్‌కు రూపాయి పెరిగింది.

**పరిశ్రమలపై పిడుగు**

విద్యుత్‌ఛార్జీల పెంపుతో పరిశ్రమలు కుదేలు కానున్నాయి. ఇప్పటికే కోతలతో నష్టాల్లో ఉన్న ఆ వర్గాలపై భారీ ఎత్తున ఛార్జీలు పెరిగాయి. ఏకాఏకిన రూ. 2300 కోట్లకు పైగా భారం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఫెర్రోఎల్లాయిస్ వర్గాలపైనే రూ. 250 కోట్లకు పైగా ఛార్జీల భారం పెరుగుతోంది. ముఖ్యంగా కుటీర, చిన్న తరహా పరిశ్రమలు, దోబీఘాట్లకు కూడా ఛార్జీలు పెంచడం గమనార్హం. భారీ పరిశ్రమలకు సగటున రూ. 1 నుంచి ఆపైన ఛార్జీలు పెంచారు.

**ప్రభుత్వ రాయితీ రూ. 5358 కోట్లు :** వచ్చే ఆర్థిక సంవత్సరం (2012-13)లో ఛార్జీలు పెంచి వసూలు చేయడానికి ప్రభుత్వం అంగీకరించడంతో డిస్కంలు రూ. 4950 కోట్లు అదనపు ఆర్థికభారం వేయడానికి ప్రతిపాదనలు రూపొందించాయి. ఈ ప్రతిపాదనల్ని పరిశీలించిన ఈఆర్‌సీ విద్యుత్‌ఛార్జీలు పెంచడానికి అంగీకరించినా మొత్తం భారం రూ. 4,442 కోట్లకు తగ్గించింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 77401 మిలియన్ యూనిట్లు విద్యుత్ సరఫరా చేయడానికి ఈఆర్‌సీ అనుమతి చ్చిఇంది. ఆర్థిక సంవత్సరంలో మొత్తం రెవెన్యూ అవసరాలు రూ. 34343 కోట్లుగా కాగా, రెవెన్యూలోటు రూ. 9800 కోట్లు ఉంటుందని ఈఆర్‌సీ తేల్చింది. ఇందులో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కింద రూ. 3620 కోట్లు, గృహ వినియోగదారులకు రూ. 1736 కోట్లుతోపాటు ఇతర రాయితీలన్నీ కలిపి రూ. 5358 కోట్లు భరించడానికి ప్రభుత్వం అంగీకరించింది. మిగిలిన రూ. 4442 కోట్లు ఛార్జీలు పెంచడం ద్వారా భర్తీకి ఈఆర్‌సీ అనుమతించింది.

## కొత్త విద్యుత్ ఛార్జీలు

### గృహ వినియోగదారులపై... (యూనిట్‌కు ఛార్జీలు రూ.లలో)

| యూనిట్లు | ప్రస్తుత ఛార్జీ | కొత్త ఛార్జీ | పెరిగినది |
|---|---|---|---|
| 0-50 | 1.45 | 1.45 | 0 |
| 51-100 | 2.80 | 2.60 | -0.20 |
| 101-200 | 3.05 | 3.60 | 0.55 |
| 201-300 | 4.75 | 5.75 | 1.00 |
| 301-500 | 6.00 | 6.75 | 0.75 |
| 501 ఆ పైన | 6.25 | 7.25 | 1.00 |

■ కనెక్టడ్ లోడు 500 వాట్ ల కంటే మించిన వినియోగదారులకు మొదటి 100 యూనిట్లకు ఎకాఎకిన యూనిట్‌కి రూ.2.60 పడుతుంది.

### వాణిజ్య వర్గాలకు... (ఎల్‌టీ)

| యూనిట్లు | ప్రస్తుత ఛార్జీ | పెంచినది | పెరిగినది |
|---|---|---|---|
| 0-50 | 3.85 | 3.85 | 0 |
| 51-100 | 6.20 | 6.00 | -0.20 |
| 101 ఆ పైన | 6.50 | 7.00 | 0.50 |

(ఎల్‌టీ వాణిజ్య కేటగిరిలో కనెక్టడ్ లోడు 500 వాట్‌లకు మించితే మొదటి వంద యూనిట్లకు యూనిట్‌కి రూ. 6 చొప్పున ఛార్జీలు పడనున్నాయి.

### అడ్వర్టుజ్‌మెంట్ హోర్డింగ్స్ (యూనిట్‌కు)

| ప్రస్తుత ఛార్జీ | పెంచినది | పెరిగినది |
|---|---|---|
| 8.50 | 9.00 | 0.50 |

### పరిశ్రమలు (యూనిట్ రూ.లలో)

| | ప్రస్తుత ఛార్జీ | పెంచినది | పెరిగినది |
|---|---|---|---|
| సాధారణ | 4.13 | 5.00 | 0.87 |
| చిన్న పరిశ్రమలు (ఎస్ఎస్ఐ) | 4.13 | 5.00 | 0.87 |

(పుట్టగొడుగులు, కుందేలు, పూల పెంపపకం, నర్సరీలకు కూడా ఛార్జీలు పెరుగుతున్నాయి

| | | | |
|---|---|---|---|
| కుటీర పరిశ్రమలు | 1.80 | 2.67 | 0.87 |
| దీబీఘాట్లు | 1.80 | 2.67 | 0.87 |
| పౌల్ట్రీలు, | 1.80 | 2.67 | 0.87 |

### వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు

| | ప్రస్తుత ఛార్జీ | పెంచినది | పెరిగినది |
|---|---|---|---|
| రొయ్యల సాగు | 1.25 | 2.12 | 0.87 |
| కార్పొరేట్ రైతులు | 1.50 | 2.50 | 1.00 |

### స్థానిక సంస్థల వీధి దీపాలు

| | | | |
|---|---|---|---|
| చిన్న పంచాయతీ | 1.87 | 2.37 | 0.50 |
| పెద్ద పంచాయతీలు | 2.50 | 3.00 | 0.50 |
| నగరపాలికలు మున్సిపాలిటీలు | 3.29 | 3.79 | 0.50 |
| మున్సిపాలిటీలు గ్రేడ్ 1,2 | 3.59 | 4.09 | 0.50 |
| కార్పొరేషన్స్ | 4.17 | 5.00 | 0.83 |

### స్థానిక సంస్థల రక్షిత తాగునీరు పథకాలు (యూనిట్‌కు)

**చిన్న పెద్ద పంచాయతీలు**

| యూనిట్లు | ప్రస్తుత ఛార్జీ | కొత్త ఛార్జీ | పెరిగినది |
|---|---|---|---|
| ఏడాదికి 2500 యూనిట్ల వరకు | 0.70 | 1.45 | 0.75 |
| 2500 యూనిట్లు దాటితే | 1.00 | 1.95 | 0.95 |

**నగరపాలికలు, మున్సిపాలిటీల్లో....**

| | | | |
|---|---|---|---|
| మొదటి 1000యూనిట్లకు | 3.75 | 4.50 | 0.75 |
| 1000 యూనిట్లుదాటితే | 4.05 | 5.00 | 0.95 |

**కార్పొరేషన్లలో...**

| | | | |
|---|---|---|---|
| 1000 యూనిట్లువరకు | 4.05 | 5.00 | 0.95 |
| 1000 యూనిట్లకుపైన | 4.60 | 5.25 | 0.65 |

**ధార్మిక సంస్థల వినియోగదారులు**

| | | | |
|---|---|---|---|
| 200 యూనిట్ల వరకు | 2.00 | 2.60 | 0.60 |
| 200 యూనిట్లు దాటితే | 4.00 | 4.50 | 0.50 |

**సాధారణ పరిశ్రమలు (హెచ్‌టీ కేటగిరి)**

| | | | |
|---|---|---|---|
| 11 కేవీ | 3.52 | 4.80 | 1.28 |
| 33 కేవీ | 3.25 | 4.37 | 1.12 |
| 132 కేవీ | 2.97 | 3.97 | 1.00 |

**ఫెర్రో ఎల్లాయిస్**

| | | | |
|---|---|---|---|
| 11 కేవీ | 2.65 | 4.48 | 2.23 |
| 33 కేవీ | 2.65 | 4.05 | 1.40 |
| 132 కేవీ | 2.65 | 3.65 | 1.00 |
| ప్రభుత్వ ఎత్తిపోతలు | 2.60 | 3.25 | 0.65 |
| రైల్వే | 4.45 | 4.50 | 0.05 |

# భారత్‌లో పేదరికాన్ని పెంచుతున్న వైద్యసేవల భారం

భారంగా తయారైన వైద్యసేవల బిల్లుల వల్ల భారతదేశంలో ఏటా 3.2 శాతం మంది పేదరికంలోకి జారిపోతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల ఒక ప్రకటనలో పేర్కొంది.

భారతదేశంలో అత్యధికులు తమ ఆదాయంలో 70 శాతం వైద్యసేవలకోసం ఖర్చు చేస్తున్నారని, శ్రీలంక లాంటి ఇతర ఆసియా దేశాలలో ఈ ఖర్చు 30–40 శాతం మాత్రమే వుందని పేర్కొంది. వైద్యసేవల ఖర్చు వల్ల ఏటా 3.9 కోట్ల మంది భారతీయులు దారిద్ర్యరేఖ దిగువకి పోతున్నారు.

గ్రామీణ ప్రాంత ప్రజల్లో 30శాతం మంది ఖర్చులకు భయపడి వైద్యసేవలకోసం పోవడం లేదు. పట్టణాలలో 20 శాతం జబ్బులు వైద్యసేవలకు నోచుకోవడం లేదు.

గ్రామీణ ప్రాంతంలో 40 శాతం మంది, పట్టణాలలో 20 శాతం మంది వైద్యసేవల కోసం అప్పులపాలవుతున్నారు. లేదా ఆస్తుల్ని కుదువపెడుతున్నారు.

2005–10 సంవత్సరాల మధ్య కేవలం మందుల మీద తలసరి ఖర్చు 29.77 శాతం నుండి 46.86 శాతానికి పెరిగింది. ఆసుపత్రులలో చేరితే అయ్యే ఖర్చు ఇదే కాలంలో 11.20 శాతం నుండి 22.47 శాతానికి పెరిగింది. అలాగే అవుట్ పేషెంట్ ఖర్చులు కూడా 30.63 శాతం నుండి 46.16 శాతానికి పెరిగాయి. ఇక రాష్ట్ర ప్రభుత్వాలు మందులు కొనుగోళ్ల మీద చేసే ఖర్చును తగ్గించుకుంటూ వస్తున్నాయి. గతంలో వైద్యబడ్జెట్‌లో 11.3 శాతం మందుల కొనుగోళ్ల మీద ఖర్చు చేసిన మహారాష్ట్ర ప్రభుత్వం దానిని 5.2 శాతానికి తగ్గించింది. హర్యానా, రాజస్థాన్, కర్నాటక, మధ్యప్రదేశ్‌లు అదే మార్గాన్ని అనుసరించాయి. కేరళలో అత్యధికంగా 17 శాతంగా వున్నా, మందుల కొనుగోళ్లశాతం 12.5కి పడిపోయింది. అలాగే తమిళనాడులో 15.3శాతం నుండి 12.2 శాతానికి తగ్గింది.

ఇలా రాష్ట్రాల బడ్జెట్లలో మందుల కొనుగోళ్లు తగ్గించడంతో ప్రభుత్వ రంగంలో వైద్యసేవలు బాగా కుంటుపడుతున్నాయి. ప్రజలు వైద్యసేవల కోసం తమ జేబులో నుంచి నేరుగా ఖర్చుపెట్టుకునే స్థితి పెరిగింది. నాసిరకం మందులు అరకొర వైద్యసేవలతో ప్రభుత్వ వైద్యసేవల రంగం ప్రజల మీద పెనుభారాలకి కారణం అయింది. ✶

**భారతదేశంలో ప్రభుత్వ వైద్యసేవలు**

| | |
|---|---|
| 1. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కమ్యూనిటీహెల్త్ సెంటర్లు | 1,75,277 |
| 2. ప్రభుత్వ ఆసుపత్రులు | 12,760 |
| 3. ఆయూష్ ఆసుపత్రులు | 24,943 |
| 4. నర్సులు | 17,02,555 |
| 5. డాక్టర్లు | 8,16,629 |
| 6. పడకల సంఖ్య (పట్టణాలలో) | 3,69,351 |
| 7. గ్రామీణ ప్రాంతంలో | 1,43,069 |
| **మూలం : సామాజిక ఆర్థిక సర్వే** | **2012** |






# రాష్ట్రంలో కుటుంబాలు,వసతులు

## 2011 గణాంక వివరాలు

హరితాంధ్రప్రదేశ్...స్వర్ణాంధ్రప్రదేశ్... వంటి నినాదాలు వినసొంపుగానే ఉన్నా... ఇవేవీ రాష్ట్ర ప్రజలకు పూర్తిస్థాయిలో మౌలికసదుపాయాలను కల్పించలేకపోతున్నాయి. రూ.లక్షల కోట్లతో వార్షిక బడ్జెట్లు, పంచవర్ష ప్రణాళికలంటూ ఊదరగొడుతున్నా రాష్ట్రంలో సగం మందికి కూడా రక్షిత తాగునీరు లభించటం లేదు. మరుగుదొడ్ల వసతిలేక బహిర్భూములకు వెళ్ళాల్సివస్తోంది. పక్కా గృహాల్లేక ఇంకా మూడొంతుల మంది పూరిళ్లలోనే తలదాచుకోవాల్సి వస్తోంది. 65% ఆడపడుచులు పొగచూరే కట్టె పొయ్యిల మీదే వంట చేయాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రజలకు అందుబాటులో ఉన్న సౌకర్యాలపై సేకరించిన కొత్త గణాంకాలు చెబుతున్న కఠోరసత్యాలివి. 2010-11లో రాష్ట్రంలో సేకరించిన జనాభా గణాంకాల్లో జిల్లాలవారీగా ప్రజలకు సౌకర్యాలను నమోదు చేశారు. రాష్ట్ర జనాభా లెక్కల విభాగం వీటిని క్రోడీకరించి విడుదల చేసింది. ఈ వివరాల ప్రకారం రాష్ట్రంలోకెల్లా ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల ప్రజలు సౌకర్యాలకు దూరంగా జీవిస్తున్నట్లు తేలింది. పలు సౌకర్యాల విషయంలో తెలంగాణా, కోస్తా జిల్లాలు మెరుగ్గా ఉన్నాయి. ఈ నివేదికలోని ముఖ్యాంశాలు.....

- మొత్తం కుటుంబాల సంఖ్య 2.10 కోట్లు. జిల్లాల వారీగా చూస్తే తూర్పుగోదావరిలో అత్యధికంగా 14.07 లక్షలు, అత్యల్పంగా నిజామాబాద్‌లో 5.90 లక్షలు.
- సొంతిల్లున్న కుటుంబాలు 78.5 శాతమే. సొంతింటిలో నివసిస్తున్న వారు తెలంగాణ జిల్లాల్లోనే అధికంగా ఉన్నారు. ఈ విషయంలో మహబూబ్‌నగర్ 91.6 శాతంతో అగ్రస్థానంలో ఉంది.
- ప్రజలు ఫోన్ల వినియోగంపై అధికంగా ఆసక్తి చూపుతున్నారు. ల్యాండ్‌లైన్, సెల్‌ఫోన్‌లలో ఏదో ఒకటిగానీ, రెండూ గానీ కలిగి ఉన్న కుటుంబాలు రాష్ట్రంలో 63.1 శాతం ఈ విషయంలో అగ్రస్థానం హైదరాబాద్‌దే. ఉత్తరాంధ్ర జిల్లాలు బాగా వెనుకబడి ఉన్నాయి. అత్యల్పంగా విజయనగరంలో 44.5 శాతం. శ్రీకాకుళం 48.2 శాతం కుటుంబాలు ఫోన్ సదుపాయం కలిగిఉన్నాయి. విశాఖనగరం పెద్దదైనా ఈ జిల్లాలో ఫోన్ ఉన్నవారి శాతం రాష్ట్ర సగటుకన్నా తక్కువే.

**జిల్లావారీగా సౌకర్యాలున్న కుటుంబాలు (శాతంలో)**

| జిల్లాపేరు | మొత్తం కుటుంబాలు | సొంత ఇల్లున్నవారు | పూరింట్లో నివాసం | గ్యాస్ కనెక్షన్ ఉన్నవారు | మరుగుదొడ్డి లేనివారు | తాగునీరు లేనివారు |
|---|---|---|---|---|---|---|
| హైదరాబాద్ | 8,81,512 | 49.6 | 1 | 66 | 0.9 | 2.2 |
| రంగారెడ్డి | 12,63,714 | 60 | 1.4 | 61.2 | 17.9 | 12.3 |
| నిజామాబాద్ | 5,90,733 | 83.1 | 5.5 | 31.6 | 57.3 | 21.8 |
| మెదక్ | 6,66,764 | 85.6 | 4.2 | 24.5 | 54.5 | 24.1 |
| కరీంనగర్ | 9,80,739 | 84 | 3.4 | 35.1 | 52.9 | 15.3 |
| నల్గొండ | 8,75,432 | 86.9 | 10 | 26.1 | 58.5 | 26.2 |
| మహబూబ్‌నగర్ | 8,73,859 | 91.6 | 25.7 | 15.7 | 71.1 | 29.1 |
| ఆదిలాబాద్ | 6,51,770 | 85.8 | 2.8 | 29.9 | 68.4 | 32.2 |
| ఖమ్మం | 7,47,586 | 82.5 | 21.4 | 29.4 | 50.8 | 20.4 |
| కర్నూలు | 8,77,182 | 81 | 41 | 22.2 | 49.9 | 24.9 |
| వరంగల్ | 8,88,553 | 85.7 | 8.5 | 26.7 | 55.3 | 23.7 |
| కడప | 7,03,136 | 79.6 | 19.7 | 29.8 | 52.6 | 12.7 |
| చిత్తూరు | 10,22,116 | 79.8 | 12.6 | 31.7 | 61.5 | 13.8 |
| కృష్ణా | 12,27,257 | 70.4 | 23 | 51.6 | 28.6 | 18.5 |
| అనంతపురం | 9,61,165 | 81.1 | 19.1 | 23.2 | 60.5 | 21.6 |
| విశాఖపట్టణం | 11,26,166 | 72.6 | 12.4 | 44 | 44.8 | 21.9 |
| ప్రకాశం | 8,57,276 | 83.7 | 14.5 | 33.9 | 61.4 | 29.6 |
| నెల్లూరు | 7,72,625 | 80.9 | 18.5 | 30.2 | 59.5 | 13.9 |
| గుంటూరు | 12,87,831 | 76.2 | 20.7 | 50.4 | 39.9 | 20.8 |
| పశ్చిమగోదావరి | 10,75,780 | 77.7 | 21 | 40.5 | 28.6 | 13.3 |
| తూర్పుగోదావరి | 14,07,410 | 77.4 | 19.1 | 34.1 | 36.3 | 16.7 |
| శ్రీకాకుళం | 6,89,323 | 88.6 | 20.9 | 21.7 | 77.4 | 27.1 |
| విజయనగరం | 5,96,605 | 86.2 | 21.6 | 23.5 | 76.6 | 17.5 |
| **రాష్ట్ర సగటు** | **2,10,24,534** | **78.5** | **15.3** | **35.8** | **48** | **19.5** |

■ బైక్/స్కూటర్/మోపెడ్ తదితర ద్విచక్రవాహనాలున్న కుటుంబాలు రాష్ట్రంలో 18.6 శాతం.

■ సైకిల్ తొక్కడంలో ఉభయ గోదావరి జిల్లాల వాసులు ముందంజలో ఉన్నారు. పశ్చిమగోదావరిలో 56.3శాతం, తూర్పుగోదావరిలో 55.4% కుటుంబాలకు సైకిళ్లున్నాయి.

■ కార్లు, జీపులు, వ్యాన్లు ఉన్న కుటుంబాలు చాలా జిల్లాల్లో రెండు శాతంలోపే.

■ ఇక హైటెక్ ఆంధ్రప్రదేశ్‌గా ప్రచారమే తప్ప.... కంప్యూటర్లవాడకం పెద్దగా లేదు. రాష్ట్ర జనాభాలో కేవలం 8,4 శాతం మందికే సొంత కంప్యూటర్లున్నాయి. ఇంటర్‌నెట్ కనెక్షన్‌తో కంప్యూటర్ లేదా ల్యాప్‌టాప్ కలిగి ఉన్నవారు 2.6% ఆదిలాబాద్‌లో కంప్యూటర్లు అధికంగా ఉన్నా... వాటికి ఇంటర్‌నెట్ కనెక్షన్ లేదు. అతి తక్కువగా విజయనగరంలో 4శాతం కుటుంబాలకే కంప్యూటర్లు ఉన్నాయి. ఇది రాష్ట్ర సగటు (8.4) లో సగంకన్నా తక్కువే.

■ రాష్ట్రంలోని 19.4 శాతం కుటుంబాలకు రేడియో, టీవీ, కంప్యూటర్, ఫోన్, మోటారువాహనం, సైకిల్... తదితరాల్లో ఏ ఒక్కటీ లేదు. ఈ విషయంలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల పరిస్థితి దయనీయం. ఈ జిల్లాల్లో 33.2 శాతం కుటుంబాలు ఈ సౌకర్యాలకు దూరంగా ఉన్నాయి. రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద నగరం కలిసి ఉన్న విశాఖపట్టణం జిల్లాలోనూ 23 శాతం కుటుంబాలకు పైన చెప్పిన ఉపకరణాలేవీ అందుబాటులో లేవు.

దాహం తీరాలన్నా కష్టమే...!

■ రాష్ట్రంలో తాగేందుకు రక్షితనీరు ఇంటిలో లభిస్తున్న కుటుంబాలు 43.2 శాతమే. ఈ విషయంలోనూ ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలు బాగా వెనకబడి ఉన్నాయి. శ్రీకాకుళంలో 15.6%, విజయనగరంలో 16 శాతం, అనంతపురంలో 23.4%, ప్రకాశంలో 23%, కర్నూలులో 25.9% కుటుంబాలకే ఇంటిలో నీటివసతి ఉంది.

■ రాష్ట్రంలోని సగం కుటుంబాలకు కూడా ఇంటిలో మరుగుదొడ్లు లేవు. మొత్తం జనాభాలో 48 శాతం మంది బహిర్భూమికి వెళుతుండగా, మరో 2.5 శాతం మంది పబ్లిక్ టాయిలెట్లు వినియోగిస్తున్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో మరుగుదొడ్ల కొరత తీవ్రంగా ఉంది.

■ పలు ప్రభుత్వ పథకాల అమలు తర్వాత కూడా ఎల్పీజీ గ్యాస్‌కనెక్షన్లు ఉన్న కుటుంబాలు రాష్ట్రంలో 35.8 శాతమే పలు జిల్లాలు ఈ సగటు కన్నా వెనకబడి ఉన్నాయి.

■ ఒకే గది ఇంటిలో సర్దుకుని బతికే కుటుంబాలు రాష్ట్రంలో 41.2% ఉన్నాయి. నెల్లూరు (58%, ప్రకాశం (54.6%), గుంటూరు (50.9%)లలో అత్యధిక కుటుంబాలు ఒక గది ఉన్న ఇంటిలోనే నివాసముంటున్నాయి. తెలంగాణా జిల్లాలు ఈ విషయంలో చాలా మెరుగ్గా ఉన్నాయి. ★

**జిల్లావారీగా సౌకర్యాలున్న కుటుంబాలు (శాతంలో)**

| జిల్లాపేరు | ఫోన్లున్న కుటుంబాలు | కంప్యూటర్ | బైక్ లేదా స్కూటరు | కారు | టీవీ | రేడియో |
|---|---|---|---|---|---|---|
| హైదరాబాద్ | 90.7 | 31.2 | 49.9 | 14.1 | 84.7 | 34.7 |
| రంగారెడ్డి | 86.6 | 23.1 | 39.4 | 9.9 | 75.2 | 21 |
| నిజామాబాద్ | 72.6 | 5.9 | 17.3 | 1.7 | 52.2 | 7.9 |
| మెదక్ | 72.4 | 7.1 | 17.9 | 2.2 | 52.4 | 10.5 |
| కరీంనగర్ | 70.5 | 4.8 | 19.7 | 1.5 | 60.1 | 3.8 |
| నల్గొండ | 67.3 | 6.1 | 16.3 | 2.2 | 53 | 5.1 |
| మహబూబ్‌నగర్ | 65.3 | 7 | 13.9 | 1.4 | 41.5 | 6.9 |
| కర్నూలు | 65.3 | 6.4 | 13.5 | 1.2 | 61.9 | 9.1 |
| వరంగల్ | 64 | 6.6 | 15.7 | 1.8 | 52.1 | 8 |
| కడప | 62.5 | 5.7 | 14 | 1.1 | 58.3 | 7.7 |
| ఆదిలాబాద్ | 61.9 | 6.9 | 14.9 | 1.3 | 47 | 3.9 |
| చిత్తూరు | 61.9 | 6.6 | 18.3 | 1.6 | 59.8 | 9.2 |
| కృష్ణా | 60.6 | 8.3 | 17.3 | 2.2 | 64.7 | 9.2 |
| అనంతపురం | 60.5 | 5 | 15 | 1 | 58.2 | 6.6 |
| విశాఖపట్టణం | 58.4 | 11.1 | 21.4 | 4.1 | 59.2 | 16.1 |
| ప్రకాశం | 57.7 | 5.1 | 12.4 | 1.1 | 54.6 | 4.8 |
| నెల్లూరు | 57.4 | 5.1 | 14 | 1.5 | 62.9 | 5.4 |
| ఖమ్మం | 57.2 | 5.6 | 15.4 | 1.6 | 55.7 | 4.8 |
| గుంటూరు | 56.9 | 6.9 | 14.8 | 1.4 | 63.4 | 8.3 |
| పశ్చిమగోదావరి | 53.8 | 5.2 | 17 | 1.4 | 60.3 | 6.5 |
| తూర్పుగోదావరి | 52.1 | 6.7 | 16.5 | 1.8 | 58.4 | 8 |
| శ్రీకాకుళం | 48.2 | 4.7 | 9.3 | 0.8 | 43.2 | 2.8 |
| విజయనగరం | 44.5 | 4 | 10.4 | 0.8 | 46.6 | 4.8 |
| **రాష్ట్రం సగటు** | **63.1** | **8.4** | **18.6** | **2.7** | **58.8** | **9.3** |

# పెరుగుతున్న ఏకబిడ్డ దంపతులు



- **రాష్ట్రప్రజల్లో కుటుంబ నియంత్రణపై మంచి అవగాహన**
- **కోస్తాలో పెళ్లిలేని సహజీవనం అధికం**
- **వెనుకబడిన జిల్లాల్లో ఉమ్మడి కుటుంబాలపై మక్కువ**

**రాష్ట్రంలో వివాహబంధంతో సంబంధం లేకుండానే సహజీవనం చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలోని మొత్తం 2.10 కోట్ల కుటుంబాల్లో వీరు 13.4 శాతం గా ఉన్నారని తేలింది. అత్యధికంగా తూర్పుగోదావరిలో 16.2 శాతం కుటుంబాలు ఇలా సహజీవనం సాగిస్తున్నాయి. తర్వాత స్థానంలో పశ్చిమగోదావరి ఉంది. శ్రీకాకుళంలో 15.6%, నెల్లూరు 15.4, కృష్ణా, ఖమ్మం 15 శాతం మంది ఇలా కలిసి జీవిస్తున్నారు. కొత్త జనాభా లెక్కల్లో కుటుంబాల స్థితిగతుల వివరాలను రాష్ట్ర జన గణన విభాగం సంచాలకురాలు వైవీ అనూరాధ విడుదల చేశారు. ఇందులో ముఖ్యాంశాలు....**

- ఒక్కరు లేదా ఇద్దరు పిల్లలతో కుటుంబ నియంత్రణ పాటిస్తూ చిన్న కుటుంబమే మేలన్న వాస్తవాన్ని రాష్ట్ర ప్రజలు బాగా గుర్తించారు. రాష్ట్రంలో 30.9 శాతం దంపతులు ఇద్దరు పిల్లలతో 17.2 శాతం దంపతులు ఒకే బిడ్డతో కుటుంబ నియంత్రణను పాటించారు. ప్రతి జిల్లాలోనూ ఇద్దరు పిల్లలతో సరిపెట్టిన కుటుంబాలు అధికంగా ఉన్నాయి. ఈ విషయంలో పశ్చిమగోదావరి, ఖమ్మం జిల్లాలు 34 శాతంతో అగ్రస్థానంలో ఉన్నాయి. ఈ తర్వాత స్థానంలో తూర్పుగోదావరి, విశాఖపట్టణం (33.8శాతం) నిలిచాయి.
- సౌకర్యాల విషయంలో వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలు కుటుంబ నియంత్రణతో చిన్న కుటుంబాల విషయంలో రాష్ట్ర సగటు కన్నా ముందుండటం విశేషం.
- ఉమ్మడి కుటుంబాల్లో మెదక్ 13.9 శాతం, మహబూబ్‌నగర్ 13.3 శాతం, కర్నూలు 12.5 శాతంతో వరుసగా తొలి మూడుస్థానాల్లో నిలిచాయి. చాలా జిల్లాల్లో మొత్తం కుటుంబాల్లో పదిశాతంలోపే ఉమ్మడి కుటుంబాలున్నాయి.
- రాష్ట్రంలో 53% కుటుంబాలకే బ్యాంకు ఖాతాలున్నాయి. ఈ విషయంలో తూర్పుగోదావరి 39.2%. పశ్చిమగోదావరి 43.6, ఖమ్మం 45.5, శ్రీకాకుళం 48.1, గుంటూరు 48.2 శాతాలతో అట్టడుగున ఉన్నాయి.
- రాష్ట్రంలో 48.8 కుటుంబాలు కాంక్రీట్ స్లాబ్ వేసిన ఇళ్లలో నివాసముంటున్నాయి. ఈ విషయంలో హైదరాబాద్ (67.2%) తరువాత నెల్లూరుదే (63.2%) ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో పూరిళ్లు, పెంకుటిళ్ళలో నివసించేవారు అధికం.
- రాష్ట్రంలో 92.2% కుటుంబాలకు విద్యుత్‌సౌకర్యం ఉంది. ఆదిలాబాద్, మహబూబ్‌నగర్‌లలో 11.5%, విజయనగరంలో 11, శ్రీకాకుళంలో 10.1% కుటుంబాలు కిరోసిన్ దీపాలతోనే నెట్టుకొస్తున్నాయి.
- ఇంటిలో స్నానాల గది లేని కుటుంబాల్లో శ్రీకాకుళం (74.2%), విజయనగరం (59.4%) జిల్లాలు తొలిరెండు స్థానాల్లో ఉన్నాయి.
- ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మూడో వంతు జనాభా ఆరుబయటే వంట చేసుకుంటున్నారు.
- రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో 72 శాతానికి పైగా ప్రజలు కలపతో వంట చేసుకుంటున్నారు. ఈ విషయంలో మహబూబ్‌నగర్ 80.2, విజయనగరం 72.1. అనంతపురం, 71.9, కర్నూలు 71.7 శ్రీకాకుళం 70.9 స్థానాల్లో అగ్రస్థానాల్లో ఉన్నాయి.
- అద్దె ఇళ్ళలో నివసించే కుటుంబాలు అత్యధికంగా హైదరాబాద్‌లో 48%, రంగారెడ్డిలో 38.3%, కృష్ణా జిల్లాలో 26.8 శాతంగా ఉంది. ✶

# అమెరికా వ్యవసాయరంగం - కొన్ని అంశాలు

- సత్యన్నారాయణ మొగళ్ళపు
- యస్. మనోరమ

అమెరికా వ్యవసాయరంగం పెట్టుబడి, సబ్సీడీలు, సాంకేతిక వనరులు పరిశోధనల కొనసాగింపు వలన పరిశ్రమగా రూపుదిద్దుకుంది.

అమెరికాలో వ్యవసాయం రైతులకు ఆర్థికంగా గిట్టుబాటు అవుతుంది. అమెరికన్ రైతుల సంవత్సర కనీస ఆదాయం 77 వేల డాలర్లు. ఇది ఇతర వర్గాల సగటు ఆదాయం కన్నా 17 శాతం ఎక్కువ. రైతులు సగటున 250 హెక్టార్లు అంటే దాదాపు 600 ఎకరాలు సేద్యం చేస్తున్నారు. ఎకరం ఖరీదు 500 డాలర్లు నుంచి 50 వేల డాలర్లు పలుకుతుంది. యాంత్రీకరణ వల్ల ఇద్దరు రైతులు 600 ఎకరాలు సులభంగా సాగుచేయగలుగుతున్నారు.

గోధుమ, మొక్కజొన్న, వరి, సోయా చిక్కుళ్ళు ప్రధానమైన పంటలు. ఒక్క కాలిఫోర్నియా రాష్ట్రంలోనే 5 లక్షల ఏకరాలలో వరిపంట పండిస్తున్నారు. కాలిఫోర్నియా రాష్ట్రం 10 శాతం వ్యవసాయ రాబడిని జాతీయ ఆదాయానికి సమకూరుస్తున్నది. ధాన్యం ధర అంతర్జాతీయ మార్కెట్టునుబట్టి నిర్ణయిస్తారు. వ్యవసాయం సాగులో భూమి స్వంతదారులు, కౌలుదారులు వున్నారు. ఎకరం భూమిని సాగు చేయడానికి దాదాపు 1000 డాలర్లు ఖర్చు అవుతుంది. 67 బస్తాల వరకు ధాన్యం పండుతుంది. సొంత వ్యవసాయదారుని లేదా కౌలురైతు శ్రమ విలువ ఉత్పత్తి ఖర్చులో జమ అవుతుంది. వ్యవసాయ శిస్తు కూడా ఉత్పత్తి ఖర్చులో లెక్కిస్తారు. రైతులు ఆస్తిపన్ను చెల్లిస్తారు. అదికాకుండా స్థానిక రాష్ట్ర ప్రభుతాలకి వ్యవసాయ పన్ను చెల్లిస్తారు. ఎకరం కౌలుకి 350 డాలర్లు కౌలుదారుడు చెల్లిస్తాడు. ఇది కూడా వ్యవసాయానికి పెట్టిన పెట్టుబడికి జమ అవుతుంది. వందలాది ఎకరాల వ్యవసాయం వల్ల రైతు ఆర్థిక పరిస్థితి మిగిలిన రంగాలలో పనిచేస్తున్న వారికి ఎంతమాత్రం తక్కువకాదు అనేది స్పష్టం. రైతులు చాలా పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేస్తారు. అమెరికన్ రైతు ఉత్పత్తి సమర్థత అభివృద్ధి చెందిన దేశాలలోనే ఎక్కువ ప్రభుత్వం ఇస్తున్న అనేక రాయితీల వల్ల వ్యవసాయం ప్రధానంగా రైతులకు లాభదాయకం అవుతున్నది. అమెరికన్ వ్యవసాయరంగంలో 2 శాతం ప్రజలు పనిచేస్తున్నారు. 5శాతం ఆదాయాన్ని వ్యవసాయరంగం జాతీయ ఆదాయానికి అందిస్తోంది. సంవత్సరానికి 250 బిలియన్లు డాలర్లు వ్యవసాయ ఆదాయం జాతీయ ఆదాయానికి జమ అవుతుంది.

పంట నష్టపోయినా, వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోయినా, ప్రకృతి విపత్తులు సంభవించినా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వ్యవసాయ విధానం రూపొందించారు. స్టాక్ ఎక్ఛేంజ్ వలె రైతులు కూడా



ముందే పంటలను మార్కెట్‌లో అమ్ముకోవచ్చు.

స్వంతభూమి గల వారు వ్రాత ప్రతి ద్వారా కౌలుదారునికి పొలం అప్పచెబుతారు. అందులో కాలపరిమితి, ఇతర వివరాలను పొందుపరుస్తారు. భూమి గలవారు మధ్యలో భూమి ఇతరులకు అమ్మినా, కౌలుదారుడు కాలపరిమితి పూర్తి అయ్యే వరకు కొనసాగుతారు. పంటను నిలవ చేసుకోవడానికి గోదాములు వ్యవసాయదారులు స్వంతంగా ఏర్పాటు చేసుకుంటారు. ప్రయివేటు గోదాములు కూడా రైతులకు అందుబాటులో వుంటాయి.

వ్యవసాయ ఉత్పత్తుల ధరలు మార్కెట్టులో రైతులకు లాభసాటిగా లేకపోతే ధర వచ్చేవరకు రైతుకు పంట మీద అప్పు ఇస్తారు.

గతంలో వచ్చిన మహామాంద్యం తర్వాత సన్నకారు రైతులను ఆదుకోవడం కోసం అనేక రకాల వ్యవసాయ సబ్సీడీలు అమల్లోకి వచ్చాయి. 1996లో అమెరికన్ కాంగ్రెస్ చేసిన (పార్లమెంటు) వ్యవసాయ బిల్లుప్రకారం రైతులకు రాయితీలు ప్రత్యక్షంగా అందుతాయి. యీ రాయితీలు 1986లో చేసిన చారిత్రాత్మక సూత్రం ఆధారంగా కేటాయింపులు జరుగుతాయి. భూమి విలువ, పంట దిగుబడి ఆధారంగా భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని రాయితీల వ్యవస్థను రూపొందించారు.

**రాయితీలు (సబ్సీడీల) రకాలు యీ విధంగా వున్నాయి.**

1. పంటలకు భీమా 2. అప్పులపై వడ్డీ రాయితీలు 3. ప్రత్యేక పంటల పరిశోధన - పర్యావరణ పరిరక్షణ 4. మార్కెటింగ్‌కు ప్రోత్సాహం 5 పౌష్టిక ఆహారం - సేకరణ 6. స్థానిక, ప్రాంతీయ, ఆహార వ్యవస్థ మార్కెటింగ్ 7. ఎగుమతి రాయితీలు.

వ్యవసాయ ఉత్పత్తులుకు మార్కెట్‌లో ధరలు పడిపోతే, ఆ మేరకు రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుంది. రైతు ఆదాయ భద్రతకు గుండెకాయవంటిది యీ నష్టపరిహారం, నిలకడగల హామీ అని చెప్పవచ్చు. మార్కెట్టులో వ్యవసాచ ఉత్పత్తులకు లాభసాటి ధర లేకపోయినట్లయితే, రైతులు అయినకాడికి పంటలను అమ్మవలసిన అవసరం లేకుండా, పంట ఉత్పత్తులపై రుణాలు ఇచ్చే రాయితీలు వున్నాయని పైన చెప్పబడింది కూడా ముఖ్యమైన ప్రభుత్వ సానుకూల విధానం యీ రెండు రకాల సబ్సీడీలు రైతులను ఆదుకోవడం అమెరికన్ ప్రభుత్వ వ్యవసాయ విధానం ప్రత్యేకతగా నిలుస్తుంది.

వినియోగదారులకు తక్కువ ధరలకే ఆహార పదార్థాలు అందుబాటులో వుండడం ప్రభుత్వం వ్యవసాయరంగానికి ఇస్తున్న ప్రాధాన్యత వల్ల సాధ్యపడుతుంది.

అన్ని పంటలకు ప్రకృతి విపత్తు నుంచి భీమా సౌకర్యం వుంటుంది. పరిశోధనలు, వాటి కొనసాగింపు మాత్రం ప్రధానంగా గోధుమ, వరి, సోయాచిక్కుళ్ళు, ప్రత్తి వంటి ప్రధాన పంటలపై కేంద్రీకరిస్తున్నారు. ప్రత్యేక ధరలతో పాలు, పంచదారలకు మార్కెట్‌పై నియంత్రణ అమల్లో వుంటుంది. పళ్ళు, కూరగాయలు, మాంసం లపై లాభసాటి ధర రైతులకు అందడం వల్ల సబ్సీడీలు ఇవ్వడం లేదు.

గత 16 సంవత్సరాల అమెరికా సంయుక్త రాష్ట్రాల వ్యవసాయ సబ్సీడీలు యీ విధంగా వున్నాయి. (1995-2010)

వ్యవసాయానికి ఇచ్చిన సబ్సీడీలు 2619 బిలియన్ డాలర్లు, వ్యవసాయ వస్తువుల సబ్సీడీలు 167.3 బిలియన్ డాలర్లు.
పంటల భీమా సబ్సీడీలు 39.2 బిలియన్ డాలర్లు.
పంటల పరిరక్షణ సబ్సీడీలు 35 బిలియన్ డాలర్లు.
విపత్తు సబ్సీడీలు 20.5 బిలియన్ డాలర్లు

2008లో అమెరికా కేంద్రప్రభుత్వం చెల్లింపులు వాస్తవంగా actively engaged వ్యవసాయం చేస్తున్న వారికే ఇవ్వాలని చట్టం చేసింది. అమెరికన్ పట్టణాలలో నివసిస్తూ వేలాది ఎకరాలు గల ఆసాములు absentee landlordism భూములను కౌలుకు ఇస్తూ, అనేక రాయితీలు పొందుతూనే వున్నారు. అమెరికా కేంద్ర వ్యవసాయశాఖ 62 శాతం రైతులు సబ్సీడీలు తీసుకోవడం లేదని వెల్లడించింది. అంటే స్వంత ఖర్చులలోనే వ్యవసాయాలు చేయగలగుతున్నారనేది తెలుస్తోంది. 10శాతం రైతులు మాత్రమే అన్ని రకాల సబ్సీడీలు వాడుకుంటున్నారనేది మరొక అంచనా.

అమెరికాలో Mid West నుంచి East West వరకు మంచు వలన 6 నెలలు పంటలు పండవు.

అమెరికన్ కాంగ్రెస్ పరిశోధన విభాగం లెక్కప్రకారం 60శాతం హక్కు చెల్లించేవారి డబ్బు అన్ని రకాల పంటల భీమాలకి ఉపయోగిస్తున్నారు. కల్తీ లేని విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, యాంత్రీకరణ భీమాసౌకర్యం విపత్తుల సమయంలో సహాయం, పరిశోధనల కొనసాగింపు, కోల్డు స్టోరేజీలు, ఇంధనం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఇంకా అనేక రకాలుగా రైతులకు అండగా ప్రభుత్వం నిలబడుతుంది. నీటిపారుదలకి సంబంధించి కొన్ని ఇబ్బందులు రైతు ఎదుర్కొంటున్నా అమెరికాలో వ్యవసాయం పరిశ్రమగా నిలదొక్కుకుంది. ★

# పోలవరాన్ని రాజకీయం చేయకండి

## తెలంగాణా, రాయలసీమలకే లబ్ధి చేకూరుతుంది

**ఏలూరులో కోస్తాంధ్ర, రైతు సదస్సులో జయప్రకాష్ నారాయణ**

పోలవరం ప్రాజక్టు నిర్మాణం పూర్తయితే దానివల్ల కృష్ణా నదికి అనుసంధానం జరిగి నాగార్జున సాగర్ పైనున్న తెలంగాణా ప్రాంతానికి, శ్రీశైలం పైనున్న రాయలసీమ ప్రాంతాలకు అదనపు నీటి సరఫరా జరుగుతుందన్నారు. దీనివల్ల ఈ రెండు ప్రాంతాల రైతులకు లాభం చేకూరుతుందని, ఈ నిజాలను ఏ పార్టీ చెప్పడానికి సాహసించడం లేదని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు, స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ స్పష్టం చేశారు. రైతాంగ సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక సీఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన కోస్తాంధ్ర ప్రాంత రైతు సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. అసలు పోలవరం ప్రాజెక్టు లేకపోయినా కృష్ణా, గోదావరి డెల్టాల్లో ఏడాదికి రెండు పంటలు పండుతున్నాయనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టు వల్ల కృష్ణా, డెల్టా ప్రాంతాలకే లాభం చేకూరుతుందని ప్రచారం జరుగుతుండటాన్ని బట్టి ఆయ ప్రాంతాల ప్రజలు ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నారన్నారు. వారికి క్షుణ్ణంగా ఈ ప్రాజెక్టు లాభాల గురించి తెలిస్తే తెలంగాణా, రాయలసీమ ప్రాంతాల రైతులు ప్రాజెక్టు నిర్మించాలని పోరాటం సాగిస్తారని తెలిపారు. ఈ విషయాన్ని చెప్పడంలో పార్టీలు, రైతు ప్రతినిధులు విఫలమయ్యారన్నారు. రాష్ట్ర సమగ్ర జలవనరుల కోసం ఈ ప్రాజెక్టు నిర్మించి తీరాలని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన కంపెనీ టెండర్లు వేసిందని లేనిపోని రాద్ధాంతం సృష్టించి టెండర్లు రద్దు చేశారని, ఏ కంపెనీ టెండర్లు వేస్తే వారికి నష్టం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రాజక్టు అంచన కన్నా 12శాతం తక్కువగా టెండర్లు ఖారారయ్యాయని, దీనివల్ల రాష్ట్ర ఖజానాకు సుమారు రూ.500 కోట్ల లాభం చేకూరేదన్నారు.




రైతులు పోరాటాలు చేస్తున్నారని ఆత్మవిశ్వాసంతో పోరాటాలు సాగించడం లేదని అభిప్రాయపడ్డారు. అసలు ఏం కావాలి? ఎందుకోసం పోరాటం చేస్తున్నాం? సాధించే మార్గం ఏమిటనేది ఆలోచించి ఆత్మవిశ్వాసంతో రైతు సమస్యలపై రైతులంతా గొంతెత్తి పోరాటాలు సాగిస్తే ఖచ్చితంగా విజయం సాధించి తీరుతారన్నారు. బీపిటీ బియ్యం ఎగుమతులపై రాష్ట్ర స్థాయిలో స్పష్టంమైన అవగాహనతో పోరాటం చేయడం వల్లే రూ. 700 పలికే దాని ధర ఇప్పుడు రూ.1000లకు పెరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అనుసరిస్తున్న పథకాల తీరు పిచ్చివాడి చేతిలో రాయిలా ఉందని ఎద్దేవా చేశారు. గుత్తేదారులకు లాభాలు చేకూర్చాలనే ధ్యేయంతో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అసలు రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి ప్రభుత్వమే పెద్ద సమస్యగా మారిందని ఆరోపించారు. రైతులంతా తమ సమస్యలపై పార్టీల జెండాలను వదిలి ఆత్మగౌరవంతో పోరాడటం నేర్చుకోవాలని సూచించారు. సమావేశంలో రైతాంగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎర్నేని నాగేంద్రనాథ్, గౌరవాధ్యక్షుడు మాగంటి సీతారామస్వామి, రాజ్యసభ మాజీ సభ్యుడు యర్రా నారాయణస్వామి, మాజీ ఎమ్మెల్యే వడ్డి వీరభద్రరావు, ఇతర నాయకులు ఎల్‌వీ ఎన్ సూర్యనారాయణ, ఎంవీఎన్ నాగిరెడ్డి, నిమ్మల రామానాయుడు, సుంకర కృష్ణమూర్తి, గద్దె శేషగిరిరావు, ఉప్పుగంటి భాస్కరరావు, చిలుకూరి సత్యవతి, నాయుడు రామచంద్రరావు, రాంభాలబోసు, గొరిపర్తి నరసింహరాజు యాదవ్, ఎంవీ సూర్యనారాయణరాజు ఉన్నారు. ★

# ఇది రైతుల ఆత్మగౌరవ పోరాటం

వ్యవసాయం ఒక వృత్తిగా హీనస్థితికి చేరింది. రైతుల బిడ్డలు వ్యవసాయం చెయ్యడానికి నిరాకరిస్తున్నారు. రైతుల కుటుంబాలలో పెళ్ళిళ్లు కూడా గగనమైపోతున్నాయి. వ్యవసాయాన్ని లాభసాటి వృత్తిగా, గౌరవప్రదమైన జీవనాన్ని ఇచ్చే వృత్తిగా చేసుకోడానికి సాగించే ఉద్యమం రైతుల ఆత్మగౌరవపోరాటం తప్ప వేరు కాదని రైతు కార్యాచరణ సమితి వ్యవస్థాపక సభ్యులు, లోక్‌సత్తా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు డి.వి.వి.యస్. వర్మ అన్నారు. భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో మార్చి 28వ తేదీని జరిగిన కార్యాచరణ సమితి సర్వసభ్య సమావేశంలో ఆయన ప్రసంగించారు.

రైతులు రాయితీల చుట్టూ తిరగడం, ప్రాధేయపడడం గౌరవప్రదమైంది కాదని వ్యవసాయాన్ని లాభసాటి చేసే విధానాల కోసం పోరాడాలని వర్మ పిలుపునిచ్చారు. రైతులు తమ పంటలని ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛ కోసం విదేశీ ఎగుమతి దిగుమతి విధానాలు రైతులకు అనుకూలంగా వుండేలా పోరాడి సాధించుకోవాలని అన్నారు. సమాజంలో కొన్ని లక్షల మంది వున్న వివిధ వర్గాల ప్రజలు రాజకీయాలకు అతీతంగా సంఘటితమై విజయాలు సాధిస్తుంటే కోట్లాదిగా వున్న రైతులలో అనైక్యతే వారి విజయాలకు అడ్డంకి అయిందని, రాజకీయాలకు అతీతంగా రైతుల్ని సంఘటితం చేసే గట్టి ప్రయత్నాలు జరగాలని ఆయన అన్నారు. రైతు కార్యాచరణ సమితి అలాంటి విశాలవేదికగా ఏర్పడి నేటికీ కొనసాగడం వల్లనే ఈ ప్రాంత రైతులకు వాణిగా నిలిచిందని, అనేక విజయాలు సాధించిందని ఆయన పేర్కొన్నారు.




రైతు కార్యాచరణ సమితి అధ్యక్షులు అల్లూరి సత్యనారాయణ రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ పార్లమెంటు సభ్యులు, సమితి అధికార ప్రతినిధి మెంటే పద్మనాభం, కృష్ణాజిల్లా రైతు సంఘ నాయకులు దాసు, డా॥ శిరిగినాడి నాగభూషణం తదితరులు ప్రసంగించారు.

రైతు కార్యాచరణ సమితి గౌరవాధ్యక్షులుగా మెంటే పద్మనాభం, డి.వి.వి.యస్. వర్మ అధ్యక్షులుగా అల్లూరి సత్యనారాయణ రాజు ఉపాధ్యక్షులుగా శిరిగివీడి నాగభూషణం, బి. పాండురంగరాజు, ప్రధాన కార్యదర్శిగా జి. నాగేశ్వరరాజు, కార్యదర్శిగా లంక కృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీలుగా యర్రా రుషికేశ్వర రావు, చినమిల్లి వీర్రాజులు ఎన్నికయారు.

సమితి ప్రధాన కార్యదర్శిగా పనిచేసి మరణించిన మల్లిన జానకయ్యకు సమావేశం తొలుత నివాళులర్పించింది. ✶

# రైతు సత్యాగ్రహ పాదయాత్రలో మహిళాసత్తా

- ఎన్.సరోజాదేవి

రైతులు పండించిన పంటను "ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛ కోసం, లాభసాటి ధరలకోసం" స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో, లోక్‌సత్తా అధినేత డా॥జయప్రకాష్ నారాయణ్ గారు వినూత్న ఉద్యమాన్ని చేపట్టి, 2012 ఫిబ్రవరి18, 19 తేదీలలో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నుండి కర్నాటక రాష్ట్రంలోని గిల్కాసుగూర్ (రాయచూర్)కు "రైతుల సత్యాగ్రహ పాదయాత్ర"... అలాగే 2012 ఫిబ్రవరి 25, 26 తేదీలలో నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డి నుండి ఎస్గి (మహారాష్ట్ర) వరకు "రైతు మహాసత్యాగ్రహయాత్ర"లను విజయవంతంగా చేసిన విషయం అందరికీ తెలుసు.

ఈ యాత్రలలో అన్ని జిల్లాల రైతు నాయకులతో బాటుగా, వివిధ రకాల పంటల రైతులు కూడా పాల్గొని ఉద్యమ విజయానికి కారకులు అయ్యారు. కష్టాలపాలవుతున్న రైతుల కన్నీరు తుడవడానికి, వ్యవసాయరంగాన్ని సంక్షోభం నుండి బయటపడేసే విధాన ప్రక్రియకు నాంది పలుకుతూ... అలనాడు (1930సం॥) మహాత్మాగాంధీ శాసనోల్లంఘన చేసి ఉప్పుసత్యాగ్రహానికి, ఎలా నడుం కట్టారో, శ్రీ జయప్రకాష్ నారాయణ్ గారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చట్టవిరుద్ధ ఆంక్షల్ని ఉల్లంఘించి, రెండో స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా ఈ రైతు సత్యాగ్రహ యాత్రలను చేపట్టి, తనని అడ్డుకుని అరెస్టు చేస్తే.. జైలుకి వెళ్లడానికి కూడా సిద్ధమే అంటూ తమ సమస్యలని భుజాలపైకి ఎత్తుకున్న తీరుకి రైతులు అందరూ జేజేలు పలికారు.

క్రిందటి సంవత్సరం అంటే 3-10-2011వ తేదీన కేంద్రం జారీ చేసిన జీవో నెంబర్ 24ను రాష్ట్ర ప్రభుత్వం ఉల్లంఘించటం చట్ట విరుద్ధమనీ, పొరుగు రాష్ట్రాలకు కూడా ధాన్యం అమ్మకుండా ఆంక్షలు విధించడం అన్యాయమనే అయితే ఆ ఆంక్షల్ని ఎత్తివేయాలని స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య డిమాండ్ చేసినా, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. కాబట్టి జేపీ గారు రైతు సత్యాగ్రహ యాత్రలకి తెరదించడమే గాక, ఫిబ్రవరి 18,19 తేదీల్లో రెండురోజుల్లో చేసిన రైతు యాత్రలో "భుజాల మీద బియ్యం మూటలు పెట్టుకొని ఎమ్మిగనూరు నుండి మంత్రాలయం మీదుగా గిల్కాసుగూర్‌లో పాదం మోపి, 5 క్వింటళ్ల బియ్యాన్ని లక్ష రూపాయలకి కర్నాటక నివాసస్తురాలు రామలక్ష్మీకి అమ్మడం జరిగింది.

అదే విధంగా ఫిబ్రవరి 25,26 తేదీల్లో జరిగిన మహాసత్యాగ్రహ యాత్రలో భాగంగా "ఎడ్లబండిలో బియ్యం మూటలు పెట్టుకుని, నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డి, సాలూరు చెక్‌పోస్టు మీదుగా ఎస్గి (మహారాష్ట్ర) చేరుకుని బియ్యాన్ని అమ్మగా షేర్‌కారి సంఘటన 'గంగాధర్‌పాటిల్' లక్షరూ॥లకి కొన్నారు.

కులాలకి, మతాలకి, రాజకీయాలకి, పార్టీలకి, పంటలకి అతీతంగా అన్ని వర్గాల ప్రజలను జేపీ గారి రైతు సత్యాగ్రహ యాత్ర అమితంగా ఆకట్టుకున్న మాట వాస్తవమే.

ఈ రైతు యాత్రలకి లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర నాయక బృందం, రెండు జిల్లాల స్థానిక లోక్‌సత్తా నాయకులు వారి వారి బాధ్యతలు నిర్వర్తించగా కె. గీతామూర్తి, ఎన్.సరోజాదేవి, విజయ కుమారి, లావణ్య, మహిళలుగా తమవంతు సహకారాన్ని కూడా అందించాలనే ఉద్దేశ్యంతో, ఆ రెండుయాత్రలకి కూడా రెండేసీ రోజులు ముందుగానే జేపీగారు పర్యటించబోయే గ్రామాలన్నింటిని (కర్నూల్లో ఎమ్మిగనూరు నుండి మాధవరం వరకూ), (నిజామాబాద్‌లో ఎల్లారెడ్డి నుండి సాలూరు వరకు) చేరుకుని ఆ గ్రామాల సర్పంచులను, గ్రామ పెద్దలను, మహిళలను రైతులను కలుసుకొని జేపీగారి యాత్ర గురించి వారికి అవగాహన కలిగించి, వారి వారి సమస్యలను వినతి పత్రాల ద్వారా తెలియచెప్పమని, జేపీగారు వారి గ్రామాల వైపు పాదయాత్రగా వచ్చే సమయానికి, వారిని సమాయత్తు చేయడం జరిగేది.

వారివారి గ్రామం కూడళ్ల దగ్గర జేపీగారికి మహిళలతో నుదుట కుంకుమలు దిద్దించి, హారతులిచ్చి, పూలహారాలతో ఘనస్వాగతం పలికారు రైతన్నలైయితే రైతు సమస్యలను ఉద్దేశించి జేపీ గారి ప్రసంగం వినడంలోనే వారు మరింత ఉత్తేజితులై రైతు సత్యాగ్రహ యాత్రలో పాలుపంచుకున్నారు.

అయితే రైతు సత్యాగ్రహయాత్రలు జరిగిన రెండు జిల్లాలు (కర్నూలు, నిజామాబాద్) లోక్‌సత్తా పార్టీ నాయకులు, నియోజకవర్గ ఇంఛార్జిలు, మహిళానాయకులు జేపీ గారు యాత్ర చేసిన అన్ని గ్రామాలపై దృష్టిపెడితే, రైతులకి మన మీద వున్న నమ్మకం సడలకుండా వుంటుంది.

ఈ సత్యాగ్రహ యాత్రలలో పలు జిల్లాల పార్టీ మహిళలు, యువత పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ✶

# రైతుల సమస్యలకు.. శాశ్వత పరిష్కారం చూపండి

**అనంతపురం, గుమ్మగట్ట :** గుమ్మగట్ట మండలంలోని కలుగోడు గ్రామ పంచాయతీ పరిదిలోని రంగచేడు, కలుగోడు, జె.వెంకటాంపల్లి గ్రామాలకు సంబంధించిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని మంజూరు చేయాలని, రైతులకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ లోక్‌సత్తా పార్టీ తాలుకా అధ్యక్షుడు బి.బాబు, ఎస్.కె.అబ్దుల్లా తదితరులు కలుగోడులో నిర్వహించిన పల్లె మేల్కొలుపు కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి గోవింద నాయక్‌కు విజ్ఞప్తి చేసినట్లు,

### మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్లు పారదర్శకంగా ఉండాలి

**అనంతపురం :** మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు రిజర్వేషన్లు పారదర్శకంగా జరపాలని లోక్‌సత్తా ఆధ్వర్యంలో కలెక్టర్ దుర్గాదాస్‌కు వినతి పత్రం అందించారు. లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్ మాట్లాడుతూ అధికార పార్టీ ఒత్తిళ్లకు తలగ్గకుండా జిల్లా అధికారులు రిజర్వేషన్లలో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదన్నారు. అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వన్నూరప్ప, కోశాధికారి ఇస్మాయిల్, జిల్లా మహిళాఅధ్యక్షురాలు సరస్వతి, సత్యనారాయణ, అమర్‌నాథ్, రఘుపతి, నాగేంద్ర పాల్గొన్నారు.

### అర్హులకు కరువు బియ్యం పంపిణీ చేయాలి

**రాయదుర్గంటౌన్ :** పట్టణంలో కరువు బియ్యాన్ని అర్హులకు పంపిణీ చేసే విధంగా రెవెన్యూ అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ తాలూకా అధ్యక్షుడు బాబు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆరోవార్డులో కరువు బియ్యం పంపిణీ నిమిత్తం లబ్దిదారులను ఎంపిక కోసం నిర్వహించిన గ్రామసభలో ఆర్.ఐ.శ్యామ్‌కు బాబు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. అదే విధంగా అర్హులైనప్పటికీ రేషన్‌కార్డులు లేనివారికి వెంటనే కార్డులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు అబ్దుల్లా, రియాజ్, లోకేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అవినీతి మంత్రులను తొలగించాలంటూ లోక్‌సత్తా ర్యాలీ

అవినీతి మంత్రులను తొలగించాలని, అవినీతి అధికారులను సస్పెండ్ చేయాలని కోరుతూ అనంతపురంలో లోక్‌సత్తా పార్టీ కార్యకర్తలు ఆ ర్యాలీ నిర్వహించారు. సప్తగిరి సర్కిల్ దగ్గర ఒక వలయంగా ఏర్పడి అవినీతి దిష్టబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జె. శ్రీనాథ్, కార్యదర్శి వన్నూరప్ప, కోశాధికారి ఇస్మాయిల్‌తోపాటు మహిళా అధ్యక్షురాలు సరస్వతమ్మ, అనంతపురం ఇన్‌చార్జి ఎమ్. కొండయ్య మరియు క్రమశిక్షణ సంఘం సభ్యులు డా॥ వినయ్, రాయసుబ్రమణ్యం, విద్యార్థి సత్తా నాయకులు అమీర్, రఘుపతి, అమర్‌నాథ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నడుస్తున్న భారతం

**ఎన్. రామకృష్ణరాజు**

నాటి రాజకీయ తరానిది సేవాదృక్పథం
నేటి తరానిది స్వప్రయోజనాపథం
వారి విగ్రహాలేకున్నా చిరస్మరణీయులు
వీరికి విగ్రహాలెన్నున్నా విస్మరణీయులు

తండ్రి అమాత్యుడైతే తనయుడిదే పెత్తనం
బావ ఎమ్మెల్యే అయితే బావమరిదిదే పెత్తనం
పదవులకు వాళ్లు పైరవీలకు వీళ్లు
విష సంస్కృతి రాజకీయానికి వీరే ఆనవాళ్లు

ప్రతిరోజు నాయకుల హామీల జోరు
ప్రారంభోత్సవ ప్రచారాల హోరు
ఎన్నటికీ పూర్తి కాని ఎన్ని'కలల' పథకాలు
ఏళ్ల తరబడి సాక్షులుగా మిగిలిన శిలాఫలకాలు

నేటి రాజకీయం డబ్బును కౌగిలించుకుంది
మతం రంగు పులుముకుంది
కులం రంగు కప్పుకుంది
పాపం ! స్వంత రంగు పోగొట్టుకుంది

# సమస్యలు పరిష్కారించాలని లోక్‌సత్తా దీక్ష

**విశాఖపట్నం, నర్సీపట్నం :** నర్సీపట్నం మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న పది సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ఒక రోజు నిరసన దీక్షా కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ నాయకులు తవ్వా చిరంజీవిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రూరల్ జిల్లా సెక్రటరీ పతకం శెట్టి రామచంద్రరావు, కట్టమూరి లింగయ్యశెట్టి, కట్టమూరి వెంకటకృష్ణ, భక్తుల రామకృష్ణ, అప్పలరాజు, లోవరాజు తదితర కార్యకర్తలు దీక్షా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ దీక్షలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మీసాల సత్యనారాయణ, సి.పి.ఎం. నాయకుడు డి. సత్తిబాబు, ఎం.ఆర్.పి. ఎస్. నియోజక వర్గ కన్వీనర్ చిందాడ నూకేశ్వరరావు తదితరులు మద్దతుగా దీక్షలో పాల్గొన్నారు. చిరంజీవిరావు మాట్లాడుతూ నర్సీపట్నం మున్సిపాలిటీలో ప్రతీరోజు ప్రజలకు మంచినీరు అందజేయాలని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మున్సిపల్ ఛైర్మన్‌ను ప్రజల నుండి నేరుగా ఎన్నుకోవాలని, మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనులను తక్షణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ దీక్షలు చేస్తున్నామని తెలిపారు.

### ఇళ్ళపట్టాలు ఇచ్చారు.. స్థలాలు చూపలేదు

**దేవనకొండ :** దేవనకొండలో ఎనిమిది సంవత్సరాల క్రితం పేదలకు ఇచ్చిన ఇళ్లపట్టాలకు అధికారులు ఇంతవరకు స్థలాలు చూపడం లేదని లోక్‌సత్తా ఆలూరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సి. శేఖర్ అన్నారు. లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట పట్టాదారులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్తూర్బాగాంధీ పాఠశాల వద్ద ఉన్న సర్వేనెంబర్ 803/ 4ఈ-1లో దాదాపు 300 మంది పేదవారికి గతంలో పట్టాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. అయితే అధికారుల నిర్లక్ష్య వల్ల పేదలకు ఇంతవరకు ఎవరి స్థలం ఎక్కడ ఉందో అనే అయోమయంలో ఉన్నారని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఇళ్లపట్టాల స్థలాలపై స్పందించి వీరికి న్యాయం చేయాలని కోరారు. పత్తికొండ తాలూకా ఇన్‌చార్జి ఆనందాచారి, వీరన్న, పెద్దరాముడు, నాగరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### తహశీల్దార్ వివరణ

గతంలో ఇళ్ల పట్టాలు తీసుకున్న లబ్ధిదారులు ఒరిజినల్ పట్టాతో మా దగ్గరికి వస్తే స్థలం చూపిస్తాం

బోగస్ పట్టాలు గ్రామంలో లేని వారికి ఇచ్చినా అలాంటి వాటిని చట్టపరంగా తొలగించి వాటిస్థానంలో అర్హులకు ఇస్తాం.

# మద్యం షాపుల వివరాలపై లోక్‌సత్తా దరఖాస్తు



**చిలకలూరిపేట :** చిలకలూరిపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఉన్న వైన్‌షాపులు, బార్ అండ్ రెస్టారెంట్ల సమాచారం అందజేయాలని కోరుతూ లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాదాసు భానుప్రసాద్ సమాచార హక్కు చట్టం ప్రకారం దరఖాస్తు చేశారు. దరఖాస్తుతో 2005 నుంచి సర్కిల్ పరిధిలో ఉన్న బెల్టుషాపులు, వాటిని తొలగించేందుకు అధికారులు తీసుకొన్న చర్యలు, పెట్టిన కేసుల వివరాలను కోరారు. మద్యం దుకాణాల లైసన్స్‌ల కాలపరిమితి వివరాలు తెలియజేయాలన్నారు. ఎక్సైజ్ సీఐ. ఎస్ఐలు అందుబాటులో లేకపోవటంతో స్టేషన్‌లోని సిబ్బందికి దరఖాస్తు అందించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ జబ్బార్, మురుకిపూడి ప్రసాద్, షేక్ సాదిక్, సిద్దిక్ పాల్గొన్నారు.





పశ్చిమగోదావరి జిల్లా పార్టీ సమావేశం



నర్సరావుపేట ఈశ్వర్ కళాశాలలో పార్టీ నిధుల సేకరణ బృందం



మహబూబ్‌నగర్ ఉప ఎన్నికల ప్రచారంలో పార్టీ కార్యకర్తలు



అనంతపురంలో అవినీతి మంత్రులను తొలగించాలంటూ ర్యాలీ



నర్సరావుపేటలో ప్రభల తయారీదారులతో....



రాయదుర్గం మండలంలో పల్లె మేలుకొలుపు



విశాఖపట్టణంలో మోడల్‌స్కూల్ నిబంధనలపై ఆందోళన

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12




రాష్ట్రాలలో లోకాయుక్త కోసం యువతతో డా॥ జయప్రకాష్ నారాయణ్

To,

**Book-Post**
PRINTED MATTER

If not delivered please return to:

**Lok Satta Times**
8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad